

ప్రజాస్పూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 26-10-2026 | సంపుటి - 31 | సంచిక - 152 | రూ : 4 | పేజీలు: 8

ముంబయిలో సీఎం రేవంత్ రెడ్డి

- నేడు ఉదయం మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో భేటీ



హైదరాబాద్ : ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముంబయి బయల్దేరి వెళ్లారు. ఆదివారం సాయంత్రం బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి ఆయనకు అక్కడకు బయల్దేరారు. సీఎంతోపాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా ముంబయికి వెళ్లారు. సోమవారం ఉదయం 11 గంటలకు అక్కడి సహ్యాద్రి స్టేట్ గెస్ట్ హౌస్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో రేవంత్ రెడ్డి భేటీ కానున్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చర్చించనున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలోని తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల మట్టంతో బ్యారేజీ నిర్మించి ప్రాణహిత నుంచి ఎల్లంపల్లికి నీటిని మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి విదితమే. ఈ అంశంపై అటు కేంద్ర ప్రభుత్వంతోనూ, ఇటు మహారాష్ట్ర ప్రభుత్వంతోనూ గత కొంతకాలంగా రేవంత్ సర్కార్ చర్చలు జరుపుతోంది. ఇందులో భాగంగానే మరోసారి తెలంగాణ, మహారాష్ట్ర సీఎంలో మరోసారి భేటీ కానున్నారు.

హైదరాబాద్ ప్రయాణికులకు శుభవార్త

- రూ. 600లకే వారం పాటు ఏసీతోసహా అన్ని బస్సుల్లో ప్రయాణం
- సరికొత్త పథకాన్ని ప్రారంభించిన ఆర్టీసీ ఎమ్‌డీ వై.నాగిరెడ్డి

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రయాణికులు, పర్యాటకులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) శుభవార్త చెప్పింది. క్యూఆర్ పరిధిలో ప్రయాణించే వారికి ఆర్టీసీ సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులకు ఆర్థిక భార తగ్గించడంతోపాటు సులభతరమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో రూ. 600 ధర కలిగిన 'వీక్లీ బస్ పాస్'ను టీఎస్ ఆర్టీసీ ఎమ్‌డీ వై నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ పాస్ కొనుగోలు చేసిన రోజు నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. తద్వారా ప్రయాణికులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఏసీ బస్సులతోసహా అన్ని రకాల సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించవచ్చు.



ఈ పాస్ 'పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్' సర్వీసులకు మాత్రం వర్తించదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రోజువారీ పాస్, నెలవారీ పాస్ సౌకర్యాలకు అదనంగా, ప్రయాణికులకు మరొక చవకైన, అనుకూలమైన ప్రయాణ ఎంపికను అందించేందుకు టీజీఎస్ ఆర్టీసీ ఈ సరికొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో స్వల్పకాలిక బస కోసం వచ్చే పర్యాటకులకు, వ్యాపారవేత్తలకు తరువాయి 2లో



సెన్సార్ బోర్డు డేటా భద్రత గాలికి... 2లో

మక్కాపై దాడి చేయలేదు..

సౌదీ చమురు క్షేత్రాలే మా లక్ష్యం

- మక్కా, మదీనాలపై దాడి చేశామన్న వార్తలను ఖండించిన హౌతీలు
- సౌదీ విమానాశ్రయాలు, చమురు క్షేత్రాలే తమ లక్ష్యమని వెల్లడి



2లో



శత్రువు తప్పించుకోలేడు

ఎయిర్ చీఫ్ హెచ్చరిక

- భారత బలగాలకు అందని లక్ష్యం లేదని ఎయిర్ చీఫ్ ఏపీ సింగ్ స్పష్టీకరణ
- 'ఆపరేషన్ సిందూర్'తో ఈ విషయం స్పష్టంగా నిరూపితమైందని వెల్లడి
- స్వదేశీ ఆయుధాల శక్తి ప్రపంచానికి తెలిసివచ్చిందని వ్యాఖ్య
- ఇండో-పసిఫిక్‌లో చైనా కదలికలపై నిరంతర నిఘా ఉంచామన్న ఎయిర్ చీఫ్
- 2047 నాటికి ఐఏఎఫ్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన దళంగా మారుతుందని ధీమా

భారత సాయుధ దళాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని, ఏ శత్రువైనా, ఏ ప్రాంతమైనా మన బలగాల పరిధిలోనే ఉందని ఎయిర్ తరువాయి 2లో

'మన్ కీ బాత్' ఒక తీర్థయాత్ర

- 12 ఏళ్లు పూర్తి చేసుకున్న 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమం
- ఈ ప్రయాణం ఒక తీర్థయాత్ర లాంటిదని అభివర్ణించిన మోదీ
- సామాన్యుల అసాధారణ కృషిని దేశం ముందుంచే గొప్ప అవకాశమని వెల్లడి
- శ్రోతలు చూపిన ఆత్మీయత, అనురాగం తనకు అమూల్యమైన ఆస్తి అని వ్యాఖ్య
- కుటుంబ సభ్యుడిలా దేశ ప్రజలతో కనెక్ట్ అయ్యే అవకాశం లభించిందన్న ప్రధాని



తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం తనకు ఒక 'తీర్థయాత్ర' లాంటిదని, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సామాన్యులు చేస్తున్న అసాధారణమైన కృషిని గౌరవించుకునే మార్గమని ఆయన అభివర్ణించారు. నేడు ప్రసారమైన 139వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో మాట్లాడుతూ, ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచి, స్ఫూర్తినిచ్చిన శ్రోతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "పన్నెండేళ్ల క్రితం, విజయదశమి పర్వదినాన మనం 'మన్ కీ బాత్' ప్రారంభించాం. అప్పటి నుంచి మన ప్రయాణం నిరంతరాయంగా తరువాయి 2లో

టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి..

నిలిచిపోయిన పారిశ్రామిక సేవలు

- తెలంగాణ కీలక పోర్టల్ టీజీ-ఐపాస్‌పై సైబర్ దాడి
- సర్వర్‌ను హ్యాక్ చేసి డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేసిన నేరగాళ్లు
- రాన్‌సమ్‌వేర్ దాడిగా నిర్ధారణ.. కేసు నమోదు చేసిన సైబర్ బ్యూరో
- పరిశ్రమల శాఖ ఫిర్యాదుతో ఐటీ చట్టం కింద దర్యాప్తు ప్రారంభం
- సోమవారానికి సేవలు పునరుద్ధరించేందుకు అధికారుల ప్రయత్నాలు





తెలంగాణ ప్రభుత్వానికి చెందిన కీలకమైన టీజీఐపాస్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగింది. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులను సులభతరం చేసే ఈ 'గవర్నమెంట్ టు బిజినెస్' (జీ2బీ) ప్లాట్‌ఫారమ్ సర్వర్‌ను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేయడంతో పోర్టల్ సేవలు పూర్తిగా తరువాయి 2లో



ఆడియో టేపుల కలకలం

మహారాష్ట్ర కూటమిలో వార్

- ఆడియో క్లిప్ విడుదల చేసిన మరాఠా ఉద్యమ నేత జారంగే పాటిల్
- బీజేపీ నుంచి రూ.500 కోట్లు అందాయన్న ఆరోపణలతో దుమారం 2లో
- మిత్రపక్షాలు బీజేపీ, శివసేన మధ్య తీవ్రమైన మాటల యుద్ధం
- సీఎం షిండేను బీజేపీలోని కొందరు టార్గెట్ చేస్తున్నారన్న శివసేన నేత
- ఆడియో క్లిప్‌పై ఫోరెన్సిక్ విచారణకు ప్రభుత్వం ఆదేశం

అమెరికాలో అయ్యప్ప శరణుఘోష..

మైనస్ డిగ్రీల చలిలోనూ కఠిన దీక్షలు!



- ఏటా 5 వేల మందికి పైగా ప్రవాసుల మాలధారణ
- మైనస్ డిగ్రీల చలిలోనూ కఠిన నియమాలతో పూజలు
- దీక్షాధారులకు అండగా నిలుస్తున్న అమెరికన్ కంపెనీలు
- యూఎస్‌లోనే శబరిమల తరహా ఆలయాల్లో దీక్షా విరమణ 2లో

సెన్సార్ బోర్డు డేటా భద్రత గాలికి

న్యూఢిల్లీ : డిజిటల్ ఇండియా అంటూ ప్రచారం చేసుకుంటున్న మోడీ ప్రభుత్వ హయాంలో కీలక ప్రభుత్వ సంస్థల సమాచార భద్రతే ప్రశ్నార్థకంగా మారుతోంది. కేంద్ర చలనచిత్ర ధ్రువీకరణ మండలి (సీబీఎఫ్‌సీ)కి చెందిన 500కు పైగా సినిమాల దరఖాస్తుల వివరాలు ఇంటర్నెట్‌లో బహిర్గతం కావడం కలకలం రేపుతోంది. చిత్రాల షూటింగ్ స్క్రిప్టులు, సెన్సార్ కట్ ఆదేశాలు, కోట్ల రూపాయల వ్యాపార ప్రయోజనాలతో ముడిపడిన పంపిణీ ఒప్పందాలు సైతం బయటపడినట్లు 'ది హిందూ' పరిశోధనలో వెల్లడైంది. డిజిటలైజేషన్‌పై గొప్పలు చెప్పుకోవడమే కాదు.. ప్రభుత్వ వ్యవస్థల్లో కీలక సమాచారాన్ని కాపాడటంలోనూ బాధ్యత, జవాబుదారీతనం ఉండాలన్న ప్రశ్నలు ఈ ఘటనతో మరోసారి ముందుకొస్తున్నాయి.

దర్యాప్తు చేస్తున్న బోర్డు

అక్టోబర్ 4న ఈ సినీప్రామాణ్ పోర్టల్ కొన్ని గంటలపాటు పనిచేయలేదు. ఆ తర్వాత కొద్దికాలానికే పత్రాల అప్‌లోడింగ్ ఆగిపోయింది. అయితే, ఏ వ్యక్తిగత సినీ నిర్మాత ఖాతా హ్యాక్ అయినట్లు ఆధారాలు లేవని సెన్సార్ బోర్డు తెలిపింది. ఈ ఘటనపై పరిశీలన ప్రారంభించామనీ, సర్వర్లు, డేటాబేస్‌ల భద్రతను తనిఖీ చేస్తున్నామని వెల్లడించింది. సైబర్ క్రైమ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతోపాటు, భారత కంప్యూటర్ అత్యవసర స్పందన బృందం (సెర్ట్-ఇన్)కు కూడా సమాచారం అందించినట్లు పేర్కొంది. ఇప్పటివరకు పరిశీలించిన ఆధారాల్లో ఆరోపణలకు సంబంధించిన సర్టిఫికేషన్ పత్రాలు అనధికారికంగా పొందినట్లు నిర్ధారణ కాలేదని బోర్డు వివరించింది. పూర్తి స్థాయి భద్రతా తనిఖీ చేపడతామని వెల్లడించింది.

ఒప్పందాల గోప్యతకు ముప్పు

లీకైన పత్రాల్లో బ్రెజిల్ నుంచి ఆస్కార్ నామినేషన్ పొందిన 'ది సీక్రెట్ ఏజెంట్', హాలీవుడ్ చిత్రం 'గుడ్ లక్, హావ్ ఫన్, డోంట్ డై' వంటి సినిమాల స్థానిక పంపిణీ ఒప్పందాలు కూడా ఉన్నాయి. కనీసం మూడు ఒప్పందాల్లో సినిమాల హక్కుల కోసం చెల్లించిన మొత్తాలు వెల్లడైనట్లు 'ది హిందూ' గుర్తించింది. ఇలాంటి వివరాలు బయటకు రావడం వల్ల నిర్మాణ సంస్థల వ్యాపార ప్రయోజనాలకు నష్టం కలగవచ్చని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సినిమాల నిర్మాణం, నటీనటుల ఎంపిక, పారితోషికాలు, లాభాల పంపిణీ, మేధో సంపత్తి హక్కులు, ప్రచార బాధ్యతలు వంటి అంశాలపై ఒప్పందాల్లో ప్రత్యేక నిబంధనలు ఉంటాయని వెరమ్ లీగల్ సంస్థ మేనేజింగ్ పార్టనర్ వసుంధర తెలిపారు. అవి బహిర్గతమైతే సంస్థల చర్చల బలం తగ్గడంతోపాటు భవిష్యత్తులో ఒప్పందాల విషయంలో వివాదాలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఇక పోటీ సంస్థలకు ఆయా కంపెనీలు ఏ షరతులకు అంగీకరిస్తాయో తెలిసిపోవడం వల్ల భవిష్యత్తు చర్చల్లో వారికి పైచేయి లభిస్తుందని ఢిల్లీకి చెందిన న్యాయవాది అభినవ్ హస్సరామన్ వివరించారు. సెన్సార్ బోర్డు డిజిటల్ వ్యవస్థలోని భద్రతా లోపాలు ఎంతవరకు సమాచార గోప్యతను దెబ్బతీశాయన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

*** 'సమాచారాన్ని భద్రంగా ఉంచడం ప్రభుత్వ బాధ్యత'**

డిజిటల్ పాలన అంటే కేవలం సేవలను ఆన్‌లైన్‌లోకి తీసుకురావడమే కాదనీ, ప్రజలు, సంస్థలకు చెందిన కీలక సమాచారాన్ని భద్రంగా ఉంచడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని నిపుణులు చెప్తున్నారు. ఈ ఘటనలో అసలు ఏం జరిగింది? సమాచారానికి అనధికారిక యాక్సెస్ ఎలా సాధ్యమైంది? భద్రతా లోపాలు ఉంటే వాటికి బాధ్యులెవరు? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉందని అంటున్నారు.

'మన్ కీ బాత్' ఒక తీర్థయాత్ర

తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్నసందర్భంగా ప్రధానమంత్రినరేంద్ర మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. ఈ ప్రయాణం తనకు ఒక 'తీర్థయాత్ర' లాంటిదని, దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో సామాన్యులు చేస్తున్న అసాధారణమైన కృషిని గౌరవించుకునే మార్గమని ఆయన అభివర్ణించారు. నేడు ప్రసారమైన 139వ 'మన్ కీ బాత్' ఎపిసోడ్‌లో మాట్లాడుతూ, ఈ ప్రయాణంలో తనకు తోడుగా నిలిచి, స్ఫూర్తినిచ్చిన శ్రోతలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "పన్నెండేళ్ల క్రితం, విజయదశమి పర్వదినాన మనం 'మన్ కీ బాత్' ప్రారంభించాం. అప్పటి నుంచి మన ప్రయాణం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఈ ప్రయాణంలో మీరంతా సహ ప్రయాణికులుగా, స్ఫూర్తిదాతలుగా ఉన్నారు. శతాబ్దాలుగా మన దేశంలో తీర్థయాత్రల సంప్రదాయం ఉంది. దేశ ప్రజల కృషిని దగ్గర నుంచి అర్థం చేసుకోవడానికి, వారి సేవలకు వందనం చేయడానికి 'మన్ కీ బాత్' నాకు ఒక తీర్థయాత్ర కన్నా తక్కువేమీ కాదు. సమాజం కోసం, దేశం కోసం జీవించే వ్యక్తులు స్వయంగా పుణ్యక్షేత్రాల వంటివారు " అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలోని సామాన్య ప్రజల కృషినీ, ధైర్యాన్ని, అంకితభావాన్ని, సేవా స్ఫూర్తిని చాటి చెప్పేందుకు 'మన్ కీ బాత్' ఒక అద్భుతమైన అవకాశమని ప్రధాని వివరించారు. ఈ 12 ఏళ్లలో, సమాజం దృష్టికి రాని ఎందరో మహానుభావుల అసాధారణమైన పనులను ఈ కార్యక్రమం ద్వారా దేశం ముందుంచామని గుర్తుచేశారు. "ఈ కార్యక్రమం ద్వారా నేను ఒకరకంగా మన దేశ ప్రజల శక్తికి నివాళులు అర్పిస్తున్నాను. దేశంలోని ప్రతి కుటుంబంతోనూ అనుబంధం పెంచుకునే అవకాశం నాకు లభించింది" అని తెలిపారు. చాలా మంది ప్రజలు తనకు సందేశాలు పంపుతూ.. 'మన్ కీ బాత్' వింటున్నప్పుడు, తమ మధ్యలో ఒక కుటుంబ సభ్యుడిగా కూర్చుని మాట్లాడుతున్నట్లు అనిపిస్తుందని చెబుతుంటారని మోదీ ఆనందం వ్యక్తం చేశారు. "శ్రోతలైన మీ అందరి ఆత్మీయత, అనురాగం నాకు నిజంగా అమూల్యమైన ఆస్తి" అని ప్రధాని భావోద్వేగంగా అన్నారు. తొలి 'మన్ కీ బాత్' కార్యక్రమం 2014 అక్టోబర్ 3న విజయదశమి రోజున ఆకాశవాణి, దూరదర్శన్ నెట్‌వర్క్‌లలో ప్రసారమైన విషయం తెలిసిందే.

హైదరాబాద్ ప్రయాణికులకు శుభవార్త

హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ప్రయాణికులు, పర్యాటకులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) శుభవార్త చెప్పింది. క్యూఆర్ పరిధిలో ప్రయాణించే వారికి ఆర్టీసీ సరికొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించడంతో పాటు సులభతరమైన ప్రయాణాన్ని అందించే లక్ష్యంతోరూ. 600 ధర కలిగిన 'వీక్లీ బస్ పాస్'ను టీఎస్ ఆర్టీసీ ఎమ్‌డీ వైనాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ పాస్ కొనుగోలు చేసిన రోజు నుంచి వరుసగా ఏడు రోజుల పాటు చెల్లుబాటు అవుతుంది. తద్వారా ప్రయాణికులు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఏసీ బస్సులతోసహా అన్ని రకాల సిటీ బస్సుల్లో అపరిమితంగా ప్రయాణించవచ్చు. ఈ పాస్ 'పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్' సర్వీసులకు మాత్రం వర్తించదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న రోజువారీ పాస్, నెలవారీ పాస్ సౌకర్యాలకు అదనంగా, ప్రయాణికులకు మరొక చవకైన, అనుకూలమైన ప్రయాణ ఎంపికను అందించేందుకు టీజీఎస్ ఆర్టీసీ ఈ సరికొత్త నిర్ణయానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో స్వల్పకాలిక బస కోసం వచ్చే పర్యాటకులకు, వ్యాపారవేత్తలకు మరియు వారం రోజుల పాటు నిరంతరం క్యూఆర్ పరిధిలో ప్రయాణించాల్సిన వారికి ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. వారంతపు పాస్ వల్ల ప్రయాణికులు ఏడు రోజుల వ్యవధిలో వేర్వేరుగా టికెట్లు కొనుగోలు చేయాల్సిన అవసరముండదు. ఒక్కసారి పాస్ తీసుకుంటే ఏడు రోజుల పాటు నగరంలో ఏ సిటీ బస్సులోనైనా (పుష్పక్ బస్సు మినహా) నిరభ్యంతరంగా, వేగంగా ప్రయాణించవచ్చు. వీక్లీ పాసులు నగరంలోని అన్ని సిటీ బస్ పాస్ కౌంటర్లలో అందుబాటులో ఉంటాయి. అవసరమైన వారు తమ సమీపంలోని బస్ పాస్ కౌంటర్లలో కొనుగోలు చేయవచ్చు తెలిపింది.

శత్రువు తప్పించుకోలేడు: ఎయిర్ చీఫ్ హెచ్చరిక

భారత సాయుధ దళాలకు అందని లక్ష్యమంటూ ఏదీ లేదని, ఏ శత్రువైనా, ఏ ప్రాంతమైనా మన బలగాల పరిధిలోనే ఉందని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్పష్టం చేశారు. గతేడాది పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ఈ విషయాన్ని ప్రపంచానికి స్పష్టంగా నిరూపించిందని ఆయన అన్నారు. అక్టోబర్ 31న పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో పీటీఐకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఆపరేషన్‌తో భారత వాయుసేన (IAF) వ్యూహాత్మకంగా ముందడుగు వేసి, ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బ తీసిందని ఆయన వివరించారు. గతేడాది మే నెలలో పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందనగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టామని ఏపీ సింగ్ గుర్తుచేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 1,200 కిలోమీటర్ల వెడల్పు, 200 కిలోమీటర్ల లోతు వరకు విస్తరించి ఉన్న ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై నిర్దిష్ట దాడులు చేశామని తెలిపారు. ఈ దాడుల ద్వారా ఏ ప్రదేశమైనా ఐఏఎఫ్ పరిధికి అతీతం కాదని తేల్చిచెప్పినట్లు అయిందన్నారు. ఆపరేషన్‌లో ఒక్క సామాన్య పౌరుడికి కూడా హాని కలగకుండా 'జీరో కొలేటరల్ డ్యామేజ్' సూత్రాన్ని కచ్చితంగా పాటించామని ఆయన గర్వంగా చెప్పారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడం వెనుక కేవలం ఒక ఆయుధం లేదా ఒక విమానం మాత్రమే లేదని, కచ్చితమైన ఇంటెలిజెన్స్, నెట్‌వర్క్డ్ ఆపరేషన్స్, స్టాండ్‌ఆఫ్ ఆయుధాలు, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, బహుళస్థాయి గగనతల రక్షణ వ్యవస్థల సమన్వయం ఉందని ఏపీ సింగ్ విశ్లేషించారు. ముఖ్యంగా, పాకిస్థాన్ సైన్యం ప్రయోగించిన డ్రోన్లు, ఇతర ఆయుధాలను మన స్వదేశీ గగనతల రక్షణ వ్యవస్థ సమర్థవంతంగా ఎదుర్కొందని అన్నారు. ఈ ఆపరేషన్‌లో కొన్ని స్వదేశీ ఆయుధ వ్యవస్థలు అద్భుతంగా పనిచేసి, శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి పెను నష్టాన్ని కలిగించాయని తెలిపారు. స్వదేశీ ఉత్పత్తి రక్షణ రంగాన్ని ఆధునికీకరించడమే కాకుండా, భారతదేశ వ్యూహాత్మక స్వావలంబనను బలోపేతం చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో, ఇండో పసిఫిక్ ప్రాంతంలో భారతదేశ సామర్థ్యాలను ప్రదర్శించడం జాతీయ భద్రతకు చాలా కీలకమని ఎయిర్ చీఫ్ మార్షల్ అభిప్రాయపడ్డారు. ఆ సైనిక విస్తరణపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళన పెరుగుతోందని, ఈ నేపథ్యంలో భారత వాయుసేన పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని చెప్పారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటానికి క్వాడ్ భాగస్వాములైన అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కలిసి భారత్ పనిచేస్తోందని తెలిపారు. ఇటీవల ఆస్ట్రేలియా, మలేషియా, థాయ్‌లాండ్‌లలో ఐఏఎఫ్ జరిపిన విన్యాసాలు సుదూర, సముద్ర గగనతల కార్యకలాపాలలో అమూల్యమైన అనుభవాన్ని అందించాయని ఆయన వివరించారు. 'వికసిత భారత్ 2047' జాతీయ దార్శనికతకు అనుగుణంగా ఐఏఎఫ్ దీర్ఘకాలిక ప్రణాళికలు ఉన్నాయని ఏపీ సింగ్ తెలిపారు. 2047 నాటికి భారత వాయుసేనను ప్రపంచంలోనే అత్యంత సమర్థవంతమైన, వినూత్నమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన బహుళడొమైన్ ఏరోస్పేస్ శక్తిగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి రక్షణ, భద్రత పునాదులని, ఆ లక్ష్య సాధనలో ఐఏఎఫ్ తన పూర్తి పాత్రను పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

టీజీఐపాస్‌పై సైబర్ దాడి..

నిలిచిపోయిన పారిశ్రామిక సేవలు

తెలంగాణ ప్రభుత్వానికి చెందిన కీలకమైన టీజీఐపాస్ పోర్టల్‌పై సైబర్ దాడి జరిగింది. రాష్ట్రంలో పారిశ్రామిక అనుమతులను సులభతరం చేసే ఈ 'గవర్నమెంట్ టు బిజినెస్' (జీ2బీ) ప్లాట్‌ఫారమ్ సర్వర్‌ను హ్యాకర్లు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేయడంతో పోర్టల్ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ఘటనపై 'తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో' (టీజీసీఎస్‌బీ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించింది. అక్టోబరు 22న రాత్రి 11:36 గంటలకు ఈ సైబర్ దాడి జరిగినట్లు అధికారులు గుర్తించారు. పోర్టల్ అప్లికేషన్ పనిచేయకపోవడంతో టెక్నికల్ బృందం వెంటనేరంగంలోకిదిగింది.క్లౌడ్4సీఅనేసంస్థ సహకారంతో సర్వర్‌ను రీస్టార్ట్ చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. లోతుగా పరిశీలించగా.. ఎస్‌క్యూఎల్ సర్వర్ ఏజెంట్ సర్వీస్ ఆగిపోయినట్లు తేలింది. పునరుద్ధరణ ప్రయత్నాలు విఫలమవడంతో ఇది సాధారణ సాంకేతిక సమస్య కాదని, హ్యాకింగ్ జరిగిందని నిర్ధారణకు వచ్చారు. సర్వర్‌లో మెషిన్ ఐడెంటిఫయర్‌తో కూడిన ఒక రాన్‌సమ్‌నోట్ కనిపించింది. హ్యాకర్లు తమ ఈమెయిల్ అడ్రస్‌ను కూడా అందులో ఉంచారు. డేటాను తొలగించకుండా, డేటాబేస్‌ను ఎన్‌క్రిప్ట్ చేసి నిలిపివేయడంతో దీనిని రాన్‌సమ్‌వేర్ దాడిగా భావిస్తున్నారు. ఈ ఘటనపై పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ సంగా సురేశ్ శనివారం తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన టీజీసీఎస్‌బీ అధికారులు, ఐటీ చట్టంలోని సెక్షన్ 43 (కంప్యూటర్ వ్యవస్థలకు నష్టం), సెక్షన్ 66 (సైబర్ నేరాలు) కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ప్రస్తుతం టీజీఐపాస్ సేవలు అందుబాటులో లేవు. హ్యాకర్లు డేటాను కాపీ చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. డేటాబేస్‌ను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి, సోమవారం నాటికి సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

ఆడియో టేపుల కలకలం: మహారాష్ట్ర కూటమిలో వార్

మహారాష్ట్ర అధికార కూటమిలో ఓ ఆడియో క్లిప్ తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. మరాఠా రిజర్వేషన్ల ఉద్యమ నేత మనోజ్ జారంగే పాటిల్‌కు, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి రూ. 500 కోట్లు అందినట్లు ఆరోపణలు రావడంతో మిత్రపక్షాలైన బీజేపీ, ఏక్‌నాథ్ షిండే వర్గం శివసేన మధ్య మాటల యుద్ధం మొదలైంది. ఈ డబ్బును ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడైన ఎంపీ శ్రీకాంత్ షిండే ద్వారా చేరవేశారని ఆ ఆడియోలో ఉండటం వివాదాన్ని మరింత రాజేసింది. గురువారం జాల్నాలో జరిగిన ప్రెస్ మీట్‌లో మనోజ్ జారంగే పాటిల్ ఈ ఆడియో క్లిప్‌ను బయటపెట్టారు. అందులో గుర్తు తెలియని మహిళ మాట్లాడుతూ 'శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే ద్వారా బీజేపీ పంపిన రూ. 500 కోట్లు ఆయనకు అందాయి' అని పేర్కొంది. అయితే, దీనిని జారంగే ఖండించారు. తాను ఎలాంటి డబ్బు తీసుకోలేదని స్పష్టం చేశారు. తనను గానీ, మరాఠా ఉద్యమాన్ని గానీ అప్రతిష్ఠపాలు చేసేందుకే ఈ క్లిప్ సృష్టించారని ఆరోపించారు. ఈ ఆడియో క్లిప్ ప్రామాణికత ఇంకా నిర్ధారణ కాలేదు. ఈ ఆరోపణలను ఏక్‌నాథ్ షిండే, శ్రీకాంత్ షిండే తీవ్రంగా ఖండించారు. "నేను 500 కోట్లు ఇవ్వలేదు, తీసుకోలేదు" అని ఉప ముఖ్యమంత్రి తేల్చిచెప్పారు. మరోవైపు, శ్రీకాంత్ షిండే వ్యంగ్యంగా స్పందిస్తూ.. అంత పెద్ద మొత్తంలో డబ్బు ఎక్కడుందో తానే వెతుకుతున్నానని, అంత భారీ నగదును తరలించడం ఎంత కష్టమో ఆలోచించాలని అన్నారు. ఈ వివాదం మరో మలుపు తీసుకుంది. శివసేన సీనియర్ నేత రామ్‌దాస్ కదమ్ సంచలన ఆరోపణలు చేశారు. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేను రాజకీయంగా దెబ్బతీసేందుకు బీజేపీలోని కొందరు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్సీలు ప్రవీణ్ దారేకర్, ప్రసాద్ లాడ్‌లను ప్రస్తావిస్తూ, జారంగే పాటిల్‌తో లాడ్ ఉన్న ఫొటోలను ప్రదర్శించారు. అయితే, బీజేపీ నేతలు ఈ ఆరోపణలను ఖండించారు. వివాదం ముదరడంతో శివసేన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను కలిసింది. అనంతరం, ఫడ్నవీస్ ఈ ఆడియో క్లిప్‌పై ఫోరెన్సిక్ విచారణకు ఆదేశించారు. మరోవైపు, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు శివసేన లేఖ రాసింది. ప్రస్తుతం ఇరుపక్షాల నేతలు వివాదాన్ని చల్లార్చే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, ఈ ఘటన మహాయుతి కూటమిలోని అంతర్గత విభేదాలను మరోసారి బయటపెట్టింది.

మక్కాపై దాడి చేయలేదు..

సౌదీ చమురు క్షేత్రాలే మా లక్ష్యం

ఇస్లాం పవిత్ర నగరాలైన మక్కా, మదీనాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేశామన్న వార్తలను యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు ఖండించారు. తమ లక్ష్యం కేవలం సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలు, చమురు శుద్ధి కర్మాగారాలు, సైనిక స్థావరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. మరోవైపు, మక్కా, మదీనా ప్రాంతాల దిశగా ప్రయోగించిన బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకున్నామని, వాటి శకలాలు కింద పడ్డాయని సౌదీ అరేబియా ప్రకటించింది. శనివారం సౌదీ దళాలు రెండు బాలిస్టిక్ క్షిపణులను గాల్లోనే ధ్వంసం చేశాయి. ఈ క్రమంలో మక్కా సమీపంతో పాటు జెద్దా, తాయిఫ్, రబీఖ్ ప్రాంతాల్లో క్షిపణి శకలాలు పడ్డాయని సౌదీ సివిల్ డిఫెన్స్ విభాగం తెలిపింది. యన్బు, తాయిఫ్‌లను లక్ష్యంగా చేసుకుని ప్రయోగించిన రెండు క్షిపణులను నాశనం చేశామని సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు పేర్కొన్నాయి. అయితే, ఈ దాడులపై హౌతీ సైనిక ప్రతినిధి యహ్యా సరీ భిన్నమైన ప్రకటన చేశారు. తాము రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయం, యన్బులోని అరామ్‌కో చమురు కేంద్రం, రబీఖ్ ఆయిల్ రిఫైనరీ, పలు చమురు పంపింగ్ స్టేషన్లను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్లు తెలిపారు. దమ్మామ్‌లోని కింగ్ ఫహద్ విమానాశ్రయం, నజ్రాన్‌లోని ఎయిర్‌పోర్ట్‌పైనా దాడి చేశామన్నారు. అయితే, ఈ దాడులు లక్ష్యాన్ని చేరుకున్నాయా? లేదా? అనేదానిపై సౌదీ అధికారులు స్పష్టత ఇవ్వలేదు. ఈ ఘర్షణలు యెమెన్ దక్షిణ ప్రాంతానికీ విస్తరించాయి. అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఏడెన్ నగరంలోని కోస్ట్ గార్డ్ ప్రధాన కార్యాలయంపై మూడు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు హౌతీలు ప్రకటించారు. సౌదీ అధికారులు ఉన్న సైనిక శిబిరాలను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపారు.

అమెరికాలో అయ్యప్ప శరణు ఘోష..

మైనస్ డిగ్రీల చలిలోనూ కఠిన దీక్షలు!

"స్వామియే శరణమయ్యప్ప" అనే శరణు ఘోష ఇప్పుడు కేవలం భారత్‌కే పరిమితం కాలేదు. అగ్రరాజ్యం అమెరికా వీధుల్లోనూ బలంగా వినిపిస్తోంది. ఉద్యోగాలు, వ్యాపారాల కోసం యూఎస్‌లో స్థిరపడిన ప్రవాస భారతీయులు తమ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ అయ్యప్ప దీక్షను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తున్నారు. ఏటా నవంబర్ 15 నుంచి జనవరి 15 వరకు అమెరికాలో అయ్యప్ప దీక్షల సందడి నెలకొంటోంది. అంచనాల ప్రకారం, ప్రతి సంవత్సరం సుమారు 5 వేల మంది ప్రవాసులు మాల ధరిస్తున్నారు. దీక్ష స్వీకరించిన వారిలో దాదాపు 90 శాతం మంది టెకీలే ఉండగా.. వైద్యులు, న్యాయవాదులు, విద్యార్థులు, చిన్నారులు సైతం ఉంటున్నారు. కాలిఫోర్నియా, ఫ్లోరిడా, టెక్సాస్ వంటి సాధారణ వాతావరణం ఉండే రాష్ట్రాలతో పాటు, మైనస్ డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే న్యూజెర్సీ, న్యూయార్క్, వర్జీనియా వంటి రాష్ట్రాల్లో నివసించే వారు సైతం ఈ కఠిన దీక్షను పాటిస్తున్నారు. చన్నీటి స్నానం, భూశయనం, పాదరక్షలు లేకుండా నడవడం వంటి నియమాలను నిష్ఠగా ఆచరిస్తున్నారు. ఇళ్లలోని బేస్‌మెంట్లలో పూజా మందిరాలు ఏర్పాటు చేసుకుని, సామూహిక భజనలు నిర్వహిస్తున్నారు.

అమెరికన్ బాస్‌ల ప్రోత్సాహం

అమెరికాలోని కార్పొరేట్ కార్యాలయాల్లో సూటు, బూటు వంటి డ్రెస్ కోడ్ తప్పనిసరి. అయినప్పటికీ, దీక్షలో ఉన్నవారు నల్లటి దుస్తులతో, పాదరక్షలు లేకుండా ఆఫీసులకు హాజరవుతున్నారు. వారి భక్తి, సంప్రదాయాల పట్ల ఉన్న పట్టుదలను చూసి అమెరికన్ బాస్‌లు సైతం ముచ్చటపడుతున్నారు. వారి మత విశ్వాసాలను గౌరవిస్తూ అవసరమైన వెసులుబాట్లు కల్పిస్తున్నారు. వర్జీనియాలోని ఫ్యానీమే, ఫ్రెడ్డీమాక్ వంటి ప్రఖ్యాత సంస్థలు తమ ఉద్యోగులకు దీక్షా కాలంలో ఇంటి నుంచి పనిచేసే (రిమోట్ వర్క్) సౌకర్యాన్ని అందిస్తున్నాయి.

ఈ నెల 27 న చిల్పూర్ బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు



జనగామ, ప్రజాస్ఫూర్తి: చిల్పూర్ గుట్టపై కొలువైన శ్రీ బుగులు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అక్టోబర్ 27వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లక్ష్మీ ప్రసన్న తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి భక్తులు, సంబంధిత అధికారులు హాజరుకానున్నారు.

మహబూబాబాద్ ప్రజలకు ఊరటనిచ్చిన శిబిరం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ పట్టణం 4వ వార్డు గాంధీపురంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత శిబిరం ప్రజలకు ఊరటనిచ్చింది,మున్సిపల్ చైర్ పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ నాయక్ హాజరై ప్రారంభించారు.కంటి ఆరోగ్యంపై అవగాహన అవసరమని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని చైర్ పర్సన్ సూచించారు,తొలిదశలోనే పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యుల సేవలను ఆమె అభినందించారు, ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు, నిర్వాహకులు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రుద్రంపూర్ గ్రామంలో కోతుల బెడదకు చెక్

*** పాలక మండలికి అభినందనల వెల్లువ**



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :చుంచుపల్లి మండలం రుద్రంపూర్ గ్రామంలో కోతుల సంచారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఊరట కల్పించేలా కోతుల పట్టివేత కార్యక్రమం గ్రామ సర్పంచ్ బానోత్ కేస్లీ , ఉప సర్పంచ్ తోటరాజు ఆధ్వర్యంలో కోతులను పట్టే కార్యక్రమం చేపట్టడంతో గ్రామంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలలో భాగంగా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టిన పాలక మండలిపై గ్రామస్తులు ప్రశంసల వర్షం కురిపించారు. కోతుల బెడద కారణంగా ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులకు ఈ చర్య ఉపశమనం కలిగించనుంది. ప్రజల ఇబ్బందులను పట్టించుకుని సమస్య పరిష్కారానికి ముందుకు రావడంపై గ్రామస్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ,ఉప సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల సమస్యలే ప్రాధాన్యంగా గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపడుతున్నామని ,ఇదే విధంగా గ్రామంలో నెలకొన్న ఇతర సమస్యలను వన్ బై వన్ పరిష్కరిస్తూ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి కృషి చేస్తామని వారన్నారు..ప్రజల మన్ననలు పొందుతున్న పాలక మండలికి ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు . ఈ కార్యక్రమంలో వివిధ వార్డ్ మెంబర్స్ తో పాటు , గ్రామ కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు .

సింగరేణి ఉద్యోగ విరమణ పొందిన మాటేటి శ్రీనివాస్‌కు పద్మశాలి సంఘం ఘన సన్మానం



భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి):సింగరేణి సంస్థలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన భూపాలపల్లి శ్రీ భార్గవ పద్మశాలి పరపతి సంఘం, 1000 క్వార్టర్స్ అధ్యక్షుడు మాటేటి శ్రీనివాస్‌ను ఆదివారం పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు గోనే భాస్కర్, షేర్ కుమారస్వామి, బల్ల మహేందర్, సుదర్శన్, కుసుమ కృష్ణమోహన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1న ఢిల్లీలో నిర్వహించే
'ఓట్ బచావో – దేశ్ బచావో' సభను విజయవంతం చేయాలి



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమంలో భాగంగా ఆదివారం సూర్యాపేట డీసీసీ కార్యాలయంలో సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుడిపాటి నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి , నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి , వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్ , వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు విలువ, ప్రజాస్వామ్య పరిరక్షణ, దేశంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఏఐసీసీ పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని,రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా 'ఓట్ బచావో - దేశ్ బచావో' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో ఇండియా కూటమి పార్టీలతో కలిసి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల వ్యవస్థపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైనదని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు విశ్వాసం కలిగించేలా పారదర్శకమైన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సంబంధిత వ్యవస్థలపై ఉందని అన్నారు. ఎన్నికల వ్యవస్థపై వ్యక్తమవుతున్న అనుమానాలపై వాస్తవాలను ప్రజల ముందుంచాలని కోరారు.'ఓట్ బచావో - దేశ్ బచావో' నినాదంతో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని సర్వోత్తమ్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి భారత పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు వెలుగు వెంకన్న, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కోతి గోపాల్ రెడ్డి, ధారావత్ వీరన్న నాయక్, ముస్కు రాంచంద్రరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేములపల్లి వాసుదేవరావు, అబ్దుల్ రహీం, తిరుమలప్రగడ అనురాధ, బాలకృష్ణ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

దేగాంగ్ గ్రామంలోఘనంగా వర్ష వాస్ ముగింపు వేడుకలు



ప్రజాస్ఫూర్తి, భైంసా :నిర్మల్ జిల్లా భైంసా మండలం దేగాం గ్రామంలో వర్షా వాస్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నలంద ఫౌండేషన్ వ్యవస్థాపకులు కపిల్ వాగ్మారే మాట్లాడుతూ బుద్ధుని బోధనల స్ఫూర్తితో వర్షావాస్ ప్రాధాన్యత బుద్ధుని కాలం నుంచి కొనసాగుతున్న వర్షావాస్ సంప్రదాయం, ధ్యానం, ధర్మబోధన, అహింసకు ప్రతీక బౌద్ధ ధర్మంలో వర్షావాసానికి ప్రత్యేకమైన చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందన్నారు. గౌతమ బుద్ధుని కాలం నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయం బౌద్ధ భిక్షువుల జీవితంలో క్రమశిక్షణ, ధ్యానం, ధర్మ అధ్యయనం,ఆత్మపరిశీలనకు ఎంతో దోహదపడిందన్నారు. వర్షాకాలంలో నిరంతరం ప్రయాణాలు చేయకుండా ఒకే ప్రాంతంలో నివసిస్తూ ధర్మ సాధన చేయడమే వర్షా బాస్ ప్రధాన ఉద్దేశం పేర్కొన్నారు.గడ్ పాలె బాబు మాట్లాడుతూ బుద్ధుని జీవితంలో గౌతమ బుద్ధుడు జీవించిన ప్రాచీన భారతదేశంలో వర్షాకాలంలో ప్రయాణాలు చేయడం కష్టంగా ఉండేదని,వర్షాల కారణంగా మొలకెత్తే మొక్కలు, చిన్నచిన్న జీవులకు హాని కలగకుండా ఉండాలనే అహింసా భావనకు కూడా ప్రాధాన్యత ఉండేదన్నారు. వర్షావాస్ సంప్రదాయం కేవలం మతపరమైన ఆచారం మాత్రమే కాకుండా,మనిషి తనలోని ఆలోచనలను పరిశీలించుకోవడానికి, చెడు అలవాట్లను సరిదిద్దుకోవడా నికి, ఇతరుల పట్ల కరుణతో వ్యవహరించడానికి ప్రేరణనిస్తుంద న్నారు. ముగింపులో భాగంగా వర్షావాసానికి సంబంధించి నిర్వహించే కార్యక్రమాలు బుద్ధుని జీవిత చరిత్ర,బౌద్ధ ధర్మ సూత్రాలు,అహింస, మానవతా విలువలపై ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ పవార్ విజయ్ కుమార్ ,గ్రామ సర్పంచ్ సీరం సుష్మా రెడ్డి, ఉపసర్పంచ్ బాలేకర్ శివాజీ, వార్డ్ మెంబర్ వాగ్మారే సుప్రియ సిద్ధోధన్, పాత్రికేయులు గంగాధర్, రిటైర్డ్ ఉపాధ్యాయులు దిగంబర్,విద్యా వాలంటర్ వాగ్మారే లక్ష్మణ్,బుద్ధ నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

డిండి ప్రాజెక్టుకు 0.6 టీఎంసీల
నీటి కేటాయింపు నిర్ణయం హర్షణీయం

*** ఎంపి డీకే అరుణ డిండి ప్రాజెక్టును రద్దు చేయాలనే వ్యాఖ్యలు సరికాదు .**

*** తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు 0.6 టీఎంసీల నీటిని కేటాయించేందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన పరిణామమని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, డిండి ఎత్తిపోతల పథకం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు, కృష్ణా జలాల వినియోగం తదితర అంశాలపై ఆయన మాట్లాడుతూ ఈ నిర్ణయం ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా ముందడుగు పడిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుపై మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ చేసిన వ్యాఖ్యలు సరికావని అభిప్రాయపడ్డారు. డిండి ప్రాజెక్టును రద్దు చేయాలని మాట్లాడటం సమంజసం కాదన్నారు. జాతీయ పార్టీలో కీలక నాయకురాలిగా, బీజేపీ ఎంపీగా ఉన్న ఆమె ప్రాంతాల మధ్య విభేదాలకు బదులుగా సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. తద్వారా ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరి, పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తయ్యే అవకాశం ఉంటుందన్నారు. డీకే అరుణ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకురావాలని ఆయన చెప్పారు. డిండి ఎత్తిపోతల పథకం కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, దశాబ్దాలుగా ఫ్లోరైడ్ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొన్న దేవరకొండ, మునుగోడు ప్రాంతాల ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో చేపట్టిన అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలను పరిగణనలోకి తీసుకొని ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సురక్షితమైన నీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ ప్రాజెక్టును రూపొందించారని పేర్కొన్నారు. నీటి వనరులను ప్రాంతాలవారీగా విభజించి వివాదాలు సృష్టించడం మంచిది కాదన్నారు. ఏ జిల్లా నీరు ఆ జిల్లాలోనే వినియోగించుకోవాలనే వాదన సరైనది కాదని, అదే విధానాన్ని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తే కర్ణాటక నుంచి తెలంగాణకు చుక్క నీరు కూడా రాదని వ్యాఖ్యానించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రతిపాదిత సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యం ఉండగా, 7.78 లక్షల ఎకరాల ఆయకట్టుకు సంబంధించిన సాగునీటి సదుపాయాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే ఎస్ఎల్‌బీసీ, ఉదయసముద్రం, డిండి, దేవాదుల వంటి ప్రాజెక్టుల ద్వారా 7.58 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, ఆయా ప్రాజెక్టుల పనులు పూర్తిస్థాయిలో పూర్తి కాలేదని తెలిపారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు ప్రత్యేకమైన ఆయకట్టు లేదని, టన్నెల్ నిర్మాణం పూర్తయ్యే వరకు ప్రత్యామ్నాయంగా లిఫ్ట్ ద్వారా నీటిని అందించాలనే ప్రతిపాదన ఉన్నట్లు వివరించారు. ప్రజలకు వీలైనంత త్వరగా సాగునీరు అందించేందుకు అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే ప్రతిపాదనలు ఉండగా, 8.50 లక్షల ఎకరాలకు సంబంధించిన సాగునీటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు.పాలమూరు ప్రాంతంలో దశాబ్దాలుగా కొనసాగిన వలసలను నివారించాలంటే రైతాంగానికి సాగునీరు అందించడం అత్యంత అవసరమన్నారు. ప్రజల ప్రయోజనాల కోసం పార్టీలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో నెలకొన్న వాస్తవ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల నీటి లభ్యతపై ఏర్పడే పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అర్థమయ్యే విధంగా వివరించారని పేర్కొన్నారు.రాష్ట్రంలోని పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ముఖ్యంగా కృష్ణా బేసిన్‌లోని ప్రాజెక్టుల పూర్తికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు.రాజకీయాలకు, ప్రాంతీయ విభేదాలకు అతీతంగా నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కోరారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:పెండింగ్ డీఏలు, పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ మండల శాఖ సర్వసభ్య సమావేశం జిల్లా భవనంలో మండల అధ్యక్షులు ఘనపురం బిక్షపతి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు డీఏలు మంజూరు చేయాలని,పీఆర్సీ కమిటీ నివేదిక ఇంకా తెప్పించుకోకపోవడం విచారకరమన్నారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బలాష్టి రమేష్, ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్ రెడ్డి, కౌన్సిలర్లు చుంచు శ్రీశైలం,ఏ.సువర్ణ, ఉపాధ్యక్షులు చీకటి ఉపేందర్,గోదాల అనిత,కార్యదర్శి రాచకొండ ఉపేందర్, బాధ్యులు వై. సాయిబాబా, గుగులోతు కిషన్,సోమ విష్ణువర్ధన్,పూజారి వీరయ్య,కే. గిరిజ తదితర 150 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ క్లబ్ ను స్వాధీనం చేసుకోవాలి

*** కమిషనర్ కు అజయ్ సారథి రెడ్డి వినతి**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:మహబూబాబాద్ మున్సిపాలిటీ నడిబొడ్డున,33వ వార్డు పరిధిలో ఉన్న చారిత్రక ప్రభుత్వ క్లబ్ (1932) ను తక్షణమే స్వాధీనం చేసుకోవాలని,సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్,33వ వార్డు కౌన్సిలర్ బి.అజయ్ సారథి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి. వినోద్ కుమార్ కు విజ్ఞప్తి చేశారు.ఈ క్లబ్ స్వాధీనం కోసం గత కొన్ని సంవత్సరాలుగా, సిపిఐ ఆధ్వర్యంలో వివిధ రూపాల్లో పోరాటం చేస్తున్నారు.పలు సార్లు వినతి పత్రాలు ఇవ్వడంతో పాటు, మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో కూడా ఈ అంశాన్ని ప్రశ్నించారు. దీనికి స్పందించిన కమిషనర్,ఆదివారం క్లబ్ ను స్వయంగా పరిశీలించారు.1932లో అప్పటి వరంగల్ కలెక్టర్ బాసిత్ అలీ పేరుతో ఏర్పాటు చేసిన క్లబ్ భవనంలోని ఫౌండేషన్ శిలాఫలకాన్ని, మున్సిపల్ రికార్డుల్లోని ఆధారాలను కౌన్సిలర్ కమిషనర్ కు చూపించారు.ఈ క్లబ్ ను స్వాధీనం చేసుకుని,ప్రధాన రోడ్డు వైపు కమర్షియల్ కాంప్లెక్స్ గా,లోపల ఉన్న ఎకరన్నర స్థలంలో జిల్లా కేంద్రానికి తలమానికంగా ఉండే ఐకాన్ నిర్మాణాన్ని చేపట్టవచ్చని వివరించారు.అన్ని అంశాలను పరిశీలించి,తగిన అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని కమిషనర్ తెలిపారు.


గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష

*** అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు కావాలి**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియపై మొగుళ్లపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఓడీసీఎంఎస్ రాష్ట్ర మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి రామస్వామి నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఓటరు నమోదు పురోగతిని సమీక్షించిన వారు, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో గ్రామాల్లో అర్హులైన పట్టభద్రులను గుర్తించి, నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించాలని కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల భాగస్వామ్యం పెరిగేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మొగుళ్లపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిల్లి మల్లయ్య కు ఘన నివాళి



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం:పాల్వంచ పట్టణానికి చెందిన పిల్లి మల్లయ్య దశదినకర్మల కార్యక్రమానికి సీపీఐ పార్టీ చుంచుపల్లి మండల కార్యదర్శి వాసిరెడ్డి మురళి , విద్యానగర్ కాలనీ ఒకటో వార్డ్ మెంబర్ గజేల్లి కృష్ణమూర్తి , సారయ్య కాలనీ గ్రామస్తులతో కలిసి దశదినకర్మలకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, సారయ్య కాలనీ గ్రామస్తులు పాల్గొన్నారు .

ఘనంగా విశ్వశాంతి హనుమత్ విరాట్పారాయణం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:హనుమత్ సేవా సమితి, మాస్టర్ ఇ.కె. సర్వీస్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలోని ఇ.కె. విద్యాలయ ప్రాంగణంలో వెయ్యి మంది భక్తులతో 108 సార్లు హనుమాన్ చాలీసా సామూహిక పారాయణ కార్యక్రమం ఆదివారం దిగ్విజయంగా, కన్నులపండుగగా జరిగింది. పెదముత్తేవీ శ్రీ క్రిష్ణాశ్రమ పీఠాధిపతి గౌరి కృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. పిల్లలను సెల్ ఫోన్లకు దూరంగా ఉంచాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా వచ్చిన కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ గణేష్ మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నానని, ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని, అందుకు తన సహకారం ఎల్లవేళలా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వాసిరెడ్డి మురళీ, కొత్వాల విమల, శ్రీనివాస్, నాగసితారాములు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు పాల్గొనగా, పావని నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. జూపూడి చిరంజీవి రావు, రవిచంద్ర, రవికాంత్ , ఇరు సంస్థల సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రక్తం దొరకక ఎవరూ చనిపోకూడదు

: సినీ డైరెక్టర్ మెహర్ రమేష్



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సజ్జనార్ పుట్టినరోజు సందర్భంగా కొత్తగూడెంకు చెందిన యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌లో మెగా బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ దర్శకుడు మెహర్ రమేష్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఇంట్లో రక్తదాతలను తయారు చేయాలనుకునే ఫౌండేషన్ యొక్క లక్ష్యం చాలా బాగుండదని, రక్తం దొరకక ఎవరు చనిపోకూడదని, అందుకు యువత బాధ్యతగా ముందుకు రావాలని అన్నారు. అలాగే, సిటీ పోలీస్ కమీషనర్ సజ్జనార్ పుట్టిన రోజు సందర్భంగా వారి మీద ఉన్న అభిమానంతో ఇక్కడ బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేయడం, ఈ క్యాంప్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాలలో అన్నిప్రాంతాల నుంచి యువత ముందుకు రావడం గొప్ప విషయమని కొనియాడారు. ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బాలు మాట్లాడుతూ తన లాగా ఎవరు ఇబ్బంది పడకూడదని, అందుకు ప్రతి ఇంట్లో రక్తదాతలను తయారు చేయడమే లక్ష్యంగా పెట్టుకొని తన అభిమాన నటుడు చిరంజీవిని స్ఫూర్తిగా తీసుకొని సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మిషన్ ఫౌండర్ ఏడుకొండలు, సర్వ్ నీడి ఫౌండర్ గౌతం కుమార్, సభ్యులు శ్రీరామ్, నరేష్, పాసెల్లి రాజేష్, కార్తీక్ రెడ్డి, రజిత రెడ్డి, స్నేహారెడ్డి, చందన లాస్య, వీరు, రాజేష్, జుబ్బు, తారక్, రక్త దాతలు సంపత్ కుమార్, రెహమాన్, మహేందర్ రెడ్డి, అయ్యప్ప, బస్వరాజు, సత్య, ఆంజనేయులు, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీకి ఫ్రీజర్ విరాళంగా అందజేత



ప్రజాస్ఫూర్తి ,జన్నారం:మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని చింతగూడ గ్రామం జడ్పీహెచ్ఎస్ 2001-2006 పూర్వ విద్యార్థుల మిత్రబృందం ఆధ్వర్యంలో ఆదివారం రోజున గ్రామపంచాయతీ కార్యాలయానికి ఫ్రీజర్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన గ్రామ ప్రజలకు అవసరమైన సమయంలో ఉపయోగపడాలనే సదుద్దేశంతో, చింతగూడ గ్రామపంచాయతీకి ఫ్రీజర్‌ను విరాళంగా అందించడం మాకు ఎంతో సంతోషంగా ఉంది అని తెలిపారు.ఈ మంచి కార్యక్రమానికి సహకరించిన మిత్రులందరికీ,గురువులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ సేవా కార్యక్రమానికి అవకాశం కల్పించిన చింతగూడ గ్రామ పెద్దలకు, గ్రామ ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం

*** ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: రక్త దానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని ఎస్ఐ శ్రీకాంత్ గౌడ్ పిలుపుని చ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగం గా జిల్లా ఎస్పీ కే.నరసింహ ఆదేశాల మేరకు కల్మల్ చెరువు రోడ్డు చౌరస్తాలో పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో అవగాహ న కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడు తూ దేశ రక్షణ కోసం ప్రాణాల ర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాల న్నారు.2026 అక్టోబర్ 26 న నిర్వహించే మెగా రక్తదాన శిబిరంలో మండల యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృం దం సభ్యులు,సిబ్బంది పాల్గొన్నారు.

స్వర్ణ గిరిలో వైభవంగా పవిత్రోత్సవాలు

*** శ్రీవెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి**







భువనగిరి, ప్రజాస్ఫూర్తి :భువనగిరి స్వర్ణ గిరి ఆలయంలో గత నాలుగు రోజుల నుండి పవిత్ర వారోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి ఈ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వారు దర్శించి మంగళాశాసనం చేసారు. క్షేత్రానికి విచ్చేసిన చిన్నజీయర్ స్వామి వారికి ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీమాన్ మానేపల్లి రామారావు కుటుంబ సమేతంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ చిన్న జీయర్ స్వామి వారు శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని అధ్యయనత్సవ మంటపంలో చిన్న జీయర్ స్వామి వారు భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేసారు. ఈ సందర్భంగా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రకృతి సమతుల్యత, జల సంరక్షణ ప్రాధాన్యతను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావం, నీటి కొరతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో... గతంలో వర్షాల కోసం వరుణ యాగాలు నిర్వహించిన ఆచారాలను స్వామివారు ప్రస్తావించారు. లోకకల్యాణం, సమస్త ప్రాణుల క్షేమం కోసం స్వర్ణగిరి ఆలయంలోనూ వరుణ యాగం నిర్వహించాలని మంగళాశాసనం చేశారు. శ్రీ గోదాదేవి అమ్మవారి తిరుప్పావైలోని నాలుగో పాశురాన్ని పఠిస్తూ, శ్రీమన్నారాయణుడి కృపకు పాత్రులు కావాలని భక్తులకు సూచించారు. మరో రెండు రోజుల్లో స్వర్ణగిరి ఆలయంలో వరుణ యాగం నిర్వహించేలా సంకల్పం ప్రకటించారు.

ప్రభుత్వ భూములే లక్ష్యంగా తవ్వకాలు.. వెంచర్లకు మట్టి తరలింపు?

*** 20 ట్రాక్టర్లతో వందలాది ట్రిప్పుల మట్టి తరలించారనే ఆరోపణలు**

*** అధికారుల తనిఖీలు ఏవీ?**



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి పట్టణంలోని కాసింపల్లి శివారు ప్రాంతంలో ప్రభుత్వ భూముల నుంచి భారీగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. జేసీబీలతో మట్టిని తవ్వి, ట్రాక్టర్ల ద్వారా పట్టణంలోని వెంచర్లకు తరలిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ, మట్టి తవ్వకాలకు అనుమతులు, సంబంధిత శాఖల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.స్థానికుల సమాచారం మేరకు సుమారు 20 ట్రాక్టర్లను వినియోగించి వందలాది ట్రిప్పుల మట్టిని తరలించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పెద్దఎత్తున తవ్వకాలు జరగడంతో ఆ ప్రాంతంలో భారీ గుంతలు ఏర్పడి భూమి స్వరూపమే మారిపోయిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, మట్టి తరలింపు పరిమాణం, తవ్వకాల విస్తీర్ణం, అనుమతుల వివరాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

*** అనుమతుల మాటేమిటి?**

ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తవ్వి తరలించేందుకు సంబంధిత శాఖల అనుమతులు తప్పనిసరా, ఈ వ్యవహారంలో నిబంధనలు పాటిస్తున్నారా అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. తవ్వకాలకు అనుమతులు మంజూరయ్యాయా? మట్టి తరలింపునకు ఎవరు అనుమతి ఇచ్చారు? ప్రభుత్వ భూముల హద్దులను గుర్తించి పర్యవేక్షిస్తున్నారా? అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. తవ్వకాలు అనుమతులకు విరుద్ధంగా జరుగుతున్నట్లయితే వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

*** క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలి**

కాసింపల్లి శివారులో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న మట్టి తవ్వకాలపై రెవెన్యూ, గనులు-భూగర్భ వనరుల శాఖ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తవ్వకాలు జరుగుతున్న భూమి ప్రభుత్వానిదా, ప్రైవేటుదా అనే అంశాన్ని నిర్ధారించడంతో పాటు, మట్టి తరలింపునకు అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అన్నది వెల్లడించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు తేలితే బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

*** ప్రభుత్వ భూముల పరిరక్షణపై దృష్టి ఎప్పుడు?**

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడటం, సహజ వనరుల అక్రమ వినియోగాన్ని అరికట్టడం సంబంధిత శాఖల బాధ్యత. కాసింపల్లి శివారులో మట్టి తవ్వకాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు స్పందించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అనుమతులు ఉంటే వాటి వివరాలను వెల్లడించడం, ఉల్లంఘనలు ఉంటే చర్యలు చేపట్టడం ద్వారా ప్రజల్లో నెలకొన్న సందేహాలకు సమాధానం చెప్పాల్సి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడిస్తారా అన్నది వేచి చూడాలి.

క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం

*** ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా ముధోల్ మండల కేంద్రంలో నిర్వహించిన ఫ్రెండ్షిప్ క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో విజయం సాధించిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ వర్గాలకు చెందిన యువకులు పాల్గొనడం అభినందనీయమని, కులమతాలకు అతీతంగా హిందూ ముస్లిం భాయ్ భాయ్ అనే ఐక్యతా సందేశాన్ని క్రీడలు చాటిచెప్పాయని అన్నారు. ఈ విషయమై ఇటీవల సంబంధిత మంత్రిని కలిసి చర్చించినట్లు వెల్లడించారు. త్వరలోనే మినీ స్టేడియం ఏర్పాటుకు మంజూరు లభించే అవకాశం ఉందని పేర్కొంటూ క్రీడాకారులకు శుభవార్త అందించారు .క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి పాలైన క్రీడాకారులు నిరాశ చెందవద్దని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ప్రజాప్రతినిధులు మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ నేషనల్ అవార్డుకు 'బోయిని బాబు' ఎంపిక

*** ఘనంగా ఎంపిక పత్రం అందజేసిన బహుజన సాహిత్య అకాడమీ**

చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:బహుజన సాహిత్య అకాడమీ (ఢిల్లీ) అందించే ప్రతిష్టాత్మక 'డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జాతీయ అవార్డు'కు కరీంనగర్ జిల్లాకు చెందిన బోయిని బాబు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని అకాడమీ జాతీయ కార్యాలయంలో అంతర్జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా ఆయన ఎంపిక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ... చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బోయిని బాబు గత రెండు దశాబ్దాలుగా బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారని తెలిపారు. దళిత, బహుజన ప్రజా సంఘాలలో భాగస్వామిగా ఉంటూ అంబేద్కర్ సిద్ధాంతాలను, ఆశయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నారని కొనియాడారు. బహుజనుల అభ్యున్నతికి, విద్యార్థుల బాటల కోసం ఆయన చేసిన నిరంతర సేవలను గుర్తించే ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు వెల్లడించారు.వచ్చే నవంబర్ 15న న్యూఢిల్లీలో జరగబోయే 20వ జాతీయ సదస్సు వేదికగా బాబుకు జాతీయ స్థాయిలో ఈ అవార్డును ప్రధానం చేయనున్నట్లు స్పష్టం చేశారు.

ప్రత్యేక కృతజ్ఞతలు:

ప్రతిష్టాత్మక జాతీయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల బోయిని బాబు హర్షం వ్యక్తం చేశారు.తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసేందుకు సహకరించిన బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్ కుమార్‌కు ఆయన ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా గోపారపు రాజు జన్మదిన వేడుకలు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా సూర్యాపేట పట్టణంలో ఆధ్యాత్మిక సేవా రంగాలలో తనదైన పాత్ర పోషిస్తూ, అందరికీ అందుబాటులో వుంటూ, అందరికీ సన్నిహితంగా ఉండే ఉపాధ్యాయులు గోపారపు రాజు జన్మదినం సందర్భంగా సుమన్ యువసేన సుమన్ వెంకన్న ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో సూర్యాపేట పట్టణంలోని ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యా వైద్యనిధికి గోపారపు రాజు ఆర్థిక సహాయం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గోపారపు రాజు మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా పెద్ద సంఖ్యలో విచ్చేసి తనకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, సంతోషి మాత దేవాలయం కమిటీ సభ్యులు, వాసవి కమిటీ సభ్యులు పలువురు వ్యాపారులు, ఉపాధ్యాయులు, జర్నలిస్టు లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

*** పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసిన మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విఠల్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, భైంసా : నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే గడ్డి గారి విఠల్ రెడ్డి రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రిని కలిసి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై విజ్ఞప్తి చేశారు. రైతులు తమ పొలాలకు సులభంగా వెళ్లేందుకు అవసరమైన రహదారుల నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల సౌకర్యం మెరుగుపడితే రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వివరించారు. వీటితో పాటు ముధోల్ నియోజకవర్గంలో చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనులకు కూడా అధిక నిధులు మంజూరు చేసి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని మంత్రికి మాజీ ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

శ్రీశ్రీశ్రీ గౌరీ కృష్ణ పండితులను సన్మానించిన విద్యానగర్ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం:చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీ లో గల మాస్టర్ ఈ కె. పాఠశాల నందు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ విద్యానగర్ విచ్చేసిన శ్రీశ్రీశ్రీ గౌరీ కృష్ణ పండితులను విద్యానగర్ కాలనీ ఉపసర్పంచ్ వాసిరెడ్డి మురళి ఘనంగా సన్మానించారు.పండితులకు శాలువా కప్పి గౌరవపూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండితుల సేవలను గౌరవించడం సమాజానికి స్ఫూర్తిదాయకమని , భారతీయ సంస్కృతి, సనాతన ధర్మ సంప్రదాయాల పరిరక్షణలో ఆధ్యాత్మిక గురువుల పాత్ర ఎంతో విశిష్టమైనదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ఈకే స్కూల్ కరస్పాండెంట్ రవి కిరణ్ , గ్రామపంచాయతీ బిల్ కలెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు ఆసుపత్రి రహదారికి తాత్కాలిక మరమ్మతులు

జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలోని చంపక్ హిల్స్ సమీపంలోని మాతా శిశు సంక్షేమ ఆసుపత్రికి వెళ్లే రహదారి దెబ్బతినడంతో రోగులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. ఈ విషయం పై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదివా రం స్పందించి, రహదారిని పరిశీలించా రు. జాతీయ రహదారుల శాఖ అధికా రులతో మాట్లాడి తాత్కాలికంగా మర మ్మతులు చేపట్టాలని సూచించారు.వా రం రోజుల్లో పనులు ప్రారంభించి 15 రోజుల్లో బీటీ రోడ్డు వేస్తామని అధికారు లు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

పాము కాటుతో మృతి చెందిన బాధిత కుటుంబానికి మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ అండ



ప్రజాస్ఫూర్తి, బైంసా :నిర్మల్ జిల్లా తానూర్ మండలనికి చెందిన తొండలా గ్రామంలో సాహెబు అనే వ్యక్తి కొద్దిరోజుల క్రితం పాము కాటుకు గురి అవ్వడం వల్ల అక్కడికక్కడే మరణించడం జరిగింది, ఈ విషయం గ్రామస్థుల ద్వారా వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ఛైర్మెన్ భోస్లే మోహన్ రావ్ పటేల్ ఈ రోజు తానూర్ మండల తొండలా గ్రామంలో వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.వారి కుటుంబానికి తన వంతుగా సహాయం చేయాలనే ఉద్ధేశ్యంతో మోహన్ రావ్ పటేల్ ప్రజా ట్రస్ట్ ద్వారా వారి భార్య దానేకర్ పిరబాయిను 10000 రూపాయల ఆర్థిక సహాయం చెక్కు రూపంలో గ్రామస్థుల సమక్షంలో అందించారు ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాయకులు యువకులు పాల్గొన్నారు.

జాతీయ ఆయుష్ మిషన్ పోస్టుల భర్తీకి ప్రశాంతంగా పరీక్షలు

*** 08 పోస్టులకు 229 దరఖాస్తులు.. 208 మంది హాజరు.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జాతీయ ఆయుష్ మిషన్ (ఎన్ఎఎం)లో భాగంగా జిల్లాలో అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన 5 కేటగిరీల్లో 8 పోస్టుల భర్తీకి ఆదివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పర్యవేక్షణలో రాత పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 229 దరఖాస్తులు రాగా, 208 మంది అభ్యర్థులు హాజరుకాగా, 21 మంది గైర్హాజరయ్యారు. ఇందులో ఆయుష్ వైద్యాధికారుల 3 పోస్టులకు 63 దరఖాస్తులు రాగా, 47 మంది హాజరయ్యారు. ఫార్మసిస్ట్ పోస్టుకు 39 మంది, మానసిక సామాజిక సలహాదారు పోస్టుకు 7 మంది, యోగా నిపుణుల పోస్టుకు 5 మంది హాజరయ్యారు. రెండు మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు 115 దరఖాస్తులు రాగా, 110 మంది పరీక్షకు హాజరయ్యారు. ఆయుష్ వైద్యాధికారులు, యోగా నిపుణుల పోస్టులకు సంబంధించి అర్హులైన 52 మంది అభ్యర్థులకు మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఇంటర్వ్యూ బోర్డు ఛైర్మన్‌గా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వ్యవహరించగా, అదనపు కలెక్టర్ బెన్షాలోమ్, జిల్లా ఉపాధి అధికారి కుమారస్వామి, జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ మమత, ఎస్. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

40 మంది అనాథ వృద్ధులకు నిత్యవసర సరుకులు పంపిణీ

*** బాల వికాస సంస్థ రాష్ట్ర అధ్యక్షులు కేడం లింగమూర్తి**



హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి: ఆప్యాయతకు దూరమై, ఆదరించే వారు లేక ఒంటరి జీవితాన్ని గడుపుతున్న అనాథ వృద్ధులకు అండగా నిలవడమే లక్ష్యంగా బాలవికాస ఆధ్వర్యంలో బాలక్క సహకారంతో హుస్నాబాద్ పట్టణంలో అనాథ వృద్ధుల ఆదరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 40 మంది అనాథ వృద్ధులకు నిత్యావసర సరుకులు, దుస్తులు, బియ్యం పెద్ద డబ్బాలు, పండ్లు పంపిణీ చేశారు. అంతేకాకుండా వృద్ధుల కోసం ప్రత్యేకంగా భోజన ఏర్పాట్లు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలవికాస వాటర్ ప్లాంట్ల ఫెడరేషన్ అధ్యక్షులు కేడం లింగమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్లు వాల సుప్రజ పిల్లి తిరుపతి హాజరయ్యారు. అలాగే దాతలు, రిటైర్డ్ ఉపాధ్యాయురాలు సంధ్యావలి సత్యం పాల్గొని వృద్ధులకు అవసరమైన సహాయ సామగ్రి పంపిణీలో భాగస్వాములయ్యారు.

కాళేశ్వరం వైఫల్యంపై తెలంగాణ ప్రజలకు కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ క్షమాపణ చెప్పాలి

*** ప్రభుత్వ విప్ వేముల వీరేశంఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి:హైదరాబాద్‌లోని సీఎల్పీకార్యాలయంలోఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం తో కలిసి భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై నోటికొచ్చినట్లు మాట్లాడటం మానుకోవాలని, ముందు బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పిదాలకు సమాధానం చెప్పాలని వారుహితవు పలికారు. రూ.30 వేల కోట్ల అంచనాలతో ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టును లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి నిర్మించినా, చివరకు అది కూలేశ్వరం అయిందని వారు ఘాటుగావిమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయవద్దని ఎన్ డి ఎస్ ఏస్పష్టంగా సూచించిందని పేర్కొన్నారు. కన్నెపల్లి పంపులను ఆన్ చేయాలని మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని, పంపులు కనీసం పది గంటల పాటు కూడా నడిచే పరిస్థితి లేదని వారన్నారు. కమీషన్ల కోసమే డిజైన్లు మార్చి, సెకండ్ ఫైల్స్



విధానంలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణలోనే ప్రాజెక్టు ఎందుకు కుంగిపోయిందో బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించి ఉంటే తెలంగాణ సస్యశ్యామలంగా మారేదని అన్నారు. నీటి వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, అధిక నీరు అవసరమయ్యే వరి సాగు విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. బొగ్గు లభ్యత లేని ప్రాంతంలో యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టును నిర్మించి నష్టానికి కారణమయ్యారని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు ప్రజాధనాన్ని వృథా చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యానికి కారణమైన నాయకులే తిరిగి ఆ ప్రాజెక్టును తమకు అప్పగించాలని కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాల్సిన కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ఇంకా బాధ్యతారహితంగా మాట్లాడటం సరికాదని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

పేదల సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

*** సుభాష్ కాలనీలో నూతన సీపీఐ జెండా ఆవిష్కరణ**

భూ పా ల ప ల్లి ,(ప్రజా స్ఫూర్తి): పట్టణంలోని 17వ వార్డు సుభాష్ కాలనీలోసీపీఐ శాఖ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జెండా గద్దను ఆ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కోరిమీ రాజ్‌కుమార్ ఆవిష్కరించారు. నూకల చంద్రమౌళి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ మాట్లాడుతూ పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీకి వందేళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉద్యమాలు



చేపడుతోందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ప్రజల పక్షాన పోరాడుతూ, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, ధరల పెరుగుదలతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. సుభాష్ కాలనీలో నూతనంగా జెండా గద్దను ఏర్పాటు చేసిన శాఖ కమిటీ సభ్యులను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోటపలుకుల రమేష్, సొతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజ్ సతీష్, నూకల చంద్రమౌళి, జి. శ్రీనివాస్, సంఘ శ్రీనివాస్, సదానందం, జిల్లా తిరుపతి, పల్లె కృష్ణ, గోలి లావణ్య, ఏనుగుల రాజయ్య, లింగయ్య కనవేని, గుడేల్లి ఐలయ్య, పవన్, రమాదేవి, సహస్ర రెడ్డి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కరువుపై రాజకీయం తగదు.. బీఆర్ఎస్‌పై ఎమ్మెల్యే గండ్ర ఫైర్

*** కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి గత పాలకులే బాధ్యులు**

భూపాలపల్లి,(ప్రజా స్ఫూర్తి):రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలోకరువును ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. ఇలాంటి పరిస్థితులను రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకుంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కరువు నివారణపై రాజకీయాలు చేయకుండా ప్రజలకు అండగా నిలవాలని సూచించారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల వైఫల్యానికి



గత బీఆర్ఎస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని గండ్ర ఆరోపించారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా మరమ్మతులు చేపట్టి ప్రాజెక్టును ప్రజలకు ఉపయోగపడేలా చేస్తామని స్పష్టం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయ మార్గాలపై నా ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. కరువు ముప్పును ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలోనే కార్యాచరణ రూపొందించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. నియోజకవర్గంలో నీటి వనరుల పునరుద్ధరణ, కరువు నివారణ పనుల కోసం సుమారు రూ.50 కోట్ల వరకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, చల్లూరు మాదన్నతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'గూడెం'లో పోలీసుల సైకిల్ ర్యాలీ

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు, టీజీఎస్పీ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపం నుంచి పాత డిపో, పోస్ట్ ఆఫీస్ సర్కిల్ మీదుగా కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు, వారి సేవలను ప్రజలకు తెలియజేయడం, పోలీసుల సేవలు, త్యాగాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పోలీసులకు, ప్రజలకు మధ్య



సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్లు రామకృష్ణారెడ్డి, రంజిత్ కుమార్, సీఐలు వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు, జి.వి. రామారావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలను అరికట్టాలి: కార్పొరేటర్ పద్మ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: యుద్ధ ప్రాతిపదికన మిషన్ భగీర పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని కొత్తగూడెం కార్పొరేషన్ 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం మిషన్ భగీరథ నీటి సరఫరా అవుతున్న సమయంలో రామవరం మెయిన్ బజార్, చాపల మార్కెట్ ఏరియా, నెహ్రూ బస్తి తదితర ప్రాంతాలను సందర్శించి ఆమె మాట్లాడుతూ ఒకవైపు ముంచుకొస్తున్న ఎల్‌నినో ప్రభావం ద్వారా నీటి వనరుల కొరతపై సాక్షాత్తు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ప్రకటనలను ఇస్తున్నప్పటికీ మరొకవైపు ప్రభుత్వ అధికారులు, మిషన్ భగీరథ నిర్వాహకులు పైప్ లైన్ లీకేజీలను అరికట్టడంలో జాప్యం చేయడం తగదని అన్నారు. తక్షణమే మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయం చేసుకొని లీకేజీల వల్ల మంచినీళ్లు వృథా కాకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, కిన్నెరసాని లైన్ ఇన్‌స్పెక్టర్ నిఖిల్, హలీం, భగీరథ పైప్‌లైన్ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలయాలలో హాజరైన మాజీ ఎమ్మెల్యే



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలో ఆదివారం నిర్వహించిన పలు శుభకార్యాల్లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు.మొగుళ్లపల్లి మండలం పర్లపల్లి గ్రామానికి చెందిన బోయిని శ్రీనివాస్ - సుజాత దంపతుల కుమార్తె రిద్విక మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా టేకుమట్ల మండలానికి చెందిన మన తెలంగాణ రిపోర్టర్ ఎలకటి ప్రవీణ్ - ఉమ దంపతుల కుమార్తె ప్రశాంతి నూతన వస్త్ర, ఫల పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఆయా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ వ్యర్థాల సేకరణ పై పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమం

*** 28న జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు**



జనగామ, ప్రజాస్ఫూర్తి : పర్యావరణ పరిరక్షణ, ఎలక్ట్రానిక్ వ్యర్థాల సురక్షిత నిర్వహణ పై అవగాహన కల్పించేందు కు 28న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రై వేటు పాఠశాలల్లో ఈ వేస్ట్ సేకరణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించ నున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి సందీప్ కుమార్ ఝా తెలిపా రు. 'ఎకోక్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్' కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో నిరుప యోగంగా ఉన్న కంప్యూటర్లు, కీబోర్డు లు, ఛార్జర్లు, కేబుళ్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించి, వివరాలను పోర్టల్ లో నమోదు చేయాలని సూచిం చారు. సేకరించిన వ్యర్థాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధీకృత సంస్థల కు మాత్రమే అప్పగించాలని, విద్యార్థు ల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రమాదక ర పరికరాలను వారితో తాకించరాదని స్పష్టం చేశారు. ఈవ్యర్థాలను సాధార ణ చెత్తలో కలపకుండా శాస్త్రీయ పద్ధ తుల్లో రీసైక్లింగ్ చేయడం ద్వారా పర్యా వరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహక రించాలని కోరారు.

జనగామలో విషాదం.. ఇంటర్ విద్యార్థిని కీర్తన ఆత్మహత్య

జనగామ, ప్రజాస్ఫూర్తి : పట్టణం లోని బతుకమ్మ కుంట ప్రాంతంలో ఇంటర్మీడి యట్ విద్యార్థిని కీర్తన (16) ఆత్మహత్య చేసుకోవడంతో విషాదం నెలకొం ది. హైదరాబాద్‌లోని నారాయణ కళా శాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కీర్తన దసరా సెలవులకు ఇంటికి వచ్చింది.ఈ క్రమంలో తెల్లవారు జామున తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమ యంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసు కొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వి ద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

గూడూరులో గులాబీ దళపతుల వ్యూహం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:గూడూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది,మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ హాజరై గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు.ఓటర్ల నమోదులో వేగం పెంచాలని ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు, సమన్వయంతో పనిచేస్తే విజయం తథ్యమని అన్నారు.మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ మాట్లాడుతూ గూడూరు గడ్డ బీఆర్ఎస్ అడ్డా అని అన్నారు,గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా,మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడ్చల్–రైలాపూర్ రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు

*** బ్రిడ్జి నిర్మాణానికి రూ.7.40 కోట్లు.. ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకుల కృతజ్ఞతలు**



మేడ్చల్,(ప్రజాస్ఫూర్తి): మేడ్చల్ ఆర్‌యూబీ నుంచి రైలాపూర్ వరకు రోడ్డు విస్తరణకు రూ.6 కోట్లు, రైలాపూర్-గౌడవెల్లి బ్రిడ్జి నిర్మాణానికి హెచ్ఎండీఏ ద్వారా రూ.7.40 కోట్లు మంజూరైన సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.మేడ్చల్ డివిజన్ బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో గిర్మాపూర్, రైలాపూర్ ప్రాంతాలకు చెందిన నాయకులు ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ నిధులతో రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయని నాయకులు పేర్కొన్నారు.

రాష్ట్ర ఫుట్‌బాల్ పోటీలకు పరిశీలకులుగా ప్రేమ్ కుమార్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు పరిశీలకుడిగా జిల్లాకు చెందిన జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు బట్టు ప్రేమ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, హైదరాబాద్ వారి ఆదేశాలతో రాష్ట్ర పాఠశాల క్రీడా కార్యదర్శి ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. 70వ రాష్ట్ర స్థాయి అండర్ 14 బాలుర ఫుట్‌బాల్ పోటీలు ఈనెల 29 నుంచి 31 వరకు మేడ్చల్ జిల్లా కొండ్లకోయ సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్‌లో జరగనున్నాయి. మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్ల నుంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయ జట్టుకు ఎంపిక చేసే ప్రక్రియలో ప్రధాన భూమిక పోషించనున్నారు. పెనగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గౌతంపూర్ నందు వ్యాయామ దర్శకుడిగా పనిచేస్తున్న బట్టు ప్రేమ్ కుమార్ రాష్ట్ర ఫుట్‌బాల్ క్రీడారంగంలో పలు జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ జట్టుకు నాయకత్వం వహించారు. భద్రాద్రి జిల్లా నుంచి వరుసగా మూడవసారిగా రాష్ట్ర పరిశీలకులుగా ఎంపిక కావడం పట్ల జిల్లా విద్యాశాఖ అధికారి శంభు ప్రసాద్, జిల్లా పాఠశాలల క్రీడా కార్యదర్శి బావ్ సింగ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పరందామరెడ్డి పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు తమ అభినందనలు తెలియజేశారు.

కుల బంధు మిత్రుల ఐక్యతే బలం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (టి ఆర్ కె ఎస్) మహబూబాబాద్ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు.జిల్లాలోని 18 మండలాల కుమ్మర సంఘం ప్రతినిధులు పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ముందు ముత్యాలమ్మ గుడి వద్ద సమావేశమై, అనంతరం పేరాల కట్టయ్య ఫంక్షన్ హాల్ రెడ్డి బజార్ లో జిల్లా సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడుతూ, కుమ్మర కులస్తుల ఐక్యత,విద్యా, ఉపాధి,రాజకీయ రంగాల్లో రావాల్సిన హక్కుల సాధన కోసం టి ఆర్ కె ఎస్ నిరంతరం కృషి చేస్తుందన్నారు. జిల్లాలో సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని,ప్రతి మండలంలో కమిటీలు పూర్తి చేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు,వివిధ మండలాల అధ్యక్షులు,కుల పెద్దలు పాల్గొన్నారు.

జన్నారం మండల కేంద్రంలో రామారావు మహారాజ్ కు ఘన నివాళి



ప్రజాస్ఫూర్తి, జన్నారం:మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో బంజారా సమాజానికి చెందిన నాయకులు ఆధ్వర్యంలో రామారావు మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా రామారావు మహారాజ్ సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలు, ఆదర్శాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. బంజారా సమాజ ఐక్యత, ఆత్మగౌరవం, అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు అజ్మీరా భీమ్లూల్ నాయక్, జన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అజ్మీరా నందు నాయక్, లౌడియా చందులాల్ నాయక్, జాటోత్ రాజు నాయక్, లావుడియా దశరథ నాయక్, మండల విద్యాధికారి బానోత్ రాజేందర్, నాయకులు బాణావత్ రాములు నాయక్ జాదవ్ సందేశ్ నాయక్, మాత లక్ష్మీదేవి తదితర బంజారా సమాజ నాయకులు పాల్గొన్నారు.

బిసి కులాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం మానుకోవాలి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి:ముదిరాజులను బీసీఏ లోకి చేర్చుతామన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనను వెనక్కి తీసుకోవాలని బీసీఏ ఐక్యకులాల పరిరక్షణ సమితి డిమాండ్ చేసింది.ఆదివారం వివేకానంద సెంటర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.బీసీఏ జాబితాలో 57 కులాలు 7% రిజర్వేషన్ తోనే వెనుకబాటుకు గురవుతున్నాయని, ఇప్పుడు బీసీడీ లోని ముదిరాజులను బి సి ఏ లోకి తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని నాయకులు మండిపడ్డారు. బీసీఏ కులాలు ఇప్పటికీ విద్యా, ఉద్యోగ,రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నాయని,తమను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరుతున్నామన్నారు.వైఎస్ఆర్ నుంచి రేవంత్ వరకు ఇలాంటి ప్రకటనలు బీసీల ఐక్యతను దెబ్బతీస్తున్నాయని, వెంటనే వెనక్కి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డోలి సత్యనారాయణ, దుగ్గి గోపాల్, ఎలగందుల కృష్ణ ప్రసాద్, కందరబోయిన ఉపేందర్,దుగ్గి రమేష్,తక్కెళ్లపల్లి శ్రీనివాస్,మద్దెల రాజన్న,పిల్లి దశరథం, దేశబోయిన రవి, శ్రీనివాస్,డోలి జగదీష్,గోపురాజు, దీటి శేషాద్రి, రామ్మూర్తి,చుక్కల పరమేశ్వర్ తదితర 50 మంది పాల్గొన్నారు.

అలరించిన స్వర గానామృతం

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: స్వర గానామృతం కార్యక్రమాన్ని సూర్యాపేటలోని బాబు జగ్జీవన్ రావు భవన్ లో జూనియర్ ఘంటసాల అలియాస్ బుర్రి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతి కళా వేదిక ద్వారా ఏర్పాటు చేయగా గాయని గాయకులు 111 పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ డా. రామ్మూర్తి యాదవ్, జైలు సూపరింటెండెంట్ సుధాకర్ రెడ్డి, విశ్రాంత అధ్యాపకుడు హమీద్ ఖాన్, ఎంఆర్ పిఎస్ రాష్ట్ర నాయకులు చిన్న శ్రీరాములు, భారత్ గ్యాస్ డీలర్ ఇరిగి కోటేశ్వరి, స్పైడ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ దయానంద్ , బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. తదుపరి కార్యక్రమాన్ని ఉద్దేశించి రామ్మూర్తి యాదవ్ మాట్లాడుతూ కళల వల్లే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుందని ,అందరూ ఆస్వాదించాలని కళల్నికళాకారులను ప్రోత్సహిస్తూగౌరవించడం సూర్యాపేట ఘనత అని, జ్ఞాన సరస్వతి కళా వేదిక ఏర్పాటు చేసే ఆనాటి పాటల ఆణిముత్యాలను ఇలాంటి కార్యక్రమాల ద్వారా వినడం సంతోషంగా ఉందని ,ఎప్పుడూ మద్దతు ఇస్తానని అన్నారు. పలు ప్రాంతాల నుండి



వచ్చిన గాయని గాయకులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ వారి గానామృతంతో అలరించారు. చివరగా షీల్డ్ ,సర్టిఫికెట్ లతో అతిథుల చేతుల మీదుగా గాయని గాయకులకు సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో అబ్రహం, సత్యం,సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామాపురం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపన

గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: గరిడేపల్లి మండల పరిధిలోనీ కోదండరామపురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇండ్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం చేసుకోవాలని ప్రభుత్వం సంకల్పించినందున ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం ఉండకూడదని ఇందిరమ్మ ఇల్లు



లేని గ్రామంలో ఓట్లు అడగమని ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నది అని తెలిపినారుఈ కార్యక్రమంలో సర్పంచ్ మచ్చ ముత్తమ్మ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పట్టెం సైదులు మాజీ ఉప సర్పంచ్ మచ్చ రమేష్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మంద బిక్షం వార్డ్ మెంబర్.పోషం త్రివేణి కోటిరెడ్డి మాజీ కో ఆప్షన్ సభ్యులు బత్తిని వెంకటయ్య మందకాంతయ్య మాజీ వార్డ్ మెంబర్ వీరబాబు మాజీ సింగిల్ విండో డైరెక్టర్ మచ్చ వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

పట్టింపు లేని శాఖలు – ప్రాణం పోతే గానీ మేల్కోరా?

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ పట్టణంలోని ఎన్ హెచ్ 365 కేసముద్రం రోడ్డు సోషల్ వెల్ఫేర్ కాలేజీ దగ్గర మెయిన్ రోడ్డు మధ్యలో ఉన్న సోలార్ ప్యానల్ నిర్మాణాన్ని పట్టించుకునే నాథుడే లేడా? పైన లక్షల విలువైన సోలార్ ప్యానల్ ఉండి,కింద ముళ్ల పొదలు,చెత్తతో నిండి నడిరోడ్డు మీద అడ్డుగోడలా మారి ప్రమాదాలకు నిలయంగా మారితే, సంబంధిత శాఖలకు పట్టదా? వేగంగా వచ్చే వాహనాలు, విద్యార్థులతో రద్దీగా ఉండే ఈ రోడ్డుపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? ప్రజా ధనంతో



ఏర్పాటు చేసిన ఈ సోలార్ వ్యవస్థను ఇలాగే నిరుపయోగంగా వదిలేస్తారా? మున్సిపాలిటీ,ఆర్ అండ్ బి,నేషనల్ హైవే అథారిటీ మూడు శాఖలు ఒకరిపై ఒకరు నెట్టేసుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారా? ప్రమాదం జరిగి ప్రాణ నష్టం జరిగితేనే మేల్కొంటారా? ఈ నిర్మాణాన్ని తక్షణమే అక్కడి నుంచి తొలగించి సురక్షిత ప్రదేశంలో ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

* **ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కళా తపస్వి యెల్ల పోశెట్టి**

హుస్నాబాద్ ,ప్రజాస్ఫూర్తి: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలోని ఆదివారం రోజున శ్రీ స్వయంభు రాజేశ్వర స్వామి క్షేత్రం నందు తెలంగాణ ఉద్యమకారుల ఫోరంటి.యు.ఎఫ్ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళా తపస్వి యెల్ల పోశెట్టి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు అనంతరం పొట్లపెళ్లి గ్రామ సర్పంచ్ రాచపల్లి శ్రీనివాస్ యెల్ల పోశెట్టి కి ఘన సన్మానం చేశారు.అనంతరం సకల కలల చేసి రాష్ట్ర కన్వీనర్ వలస సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ కళాతపస్వి పోశెట్టి తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని వారు పేర్కొన్నారు. ఉద్యమకారులకు రాష్ట్ర



ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని వారు పేర్కొన్నారు వచ్చేనెల సకల కలల జేఏసీ ఆధ్వర్యంలో 18న కరీంనగర్ లో కళాకారులచే భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వారన్నారు పోశెట్టి మాట్లాడుతూ అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం కళాకారులకు శుభాకాంక్షలు.తెలియజేశారు తెలంగాణ ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు కళాకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో పొట్లపల్లి వార్డ్ సభ్యులు దేవసాని ప్రశాంత్ రెడ్డి పాకాల శ్యామ్ సుందర్ చొప్పరి శ్రీనివాస్ తదితర కళాకారులు భక్తులు పాల్గొన్నారు.

గోదావరి జలాలను ఒడిసిపట్టి.. తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం

* **దుమ్ముగూడెం ఆనకట్టపై ఒక టీఎంసీ నీటి నిల్వకు చర్యలు**
* **మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు చేపడుతున్న పనులను



పరిశీలించిన మంత్రి, పనుల పురోగతి, గోదావరి నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మగారిపల్లి నుంచి దుమ్ముగూడెం వరకు పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే నీటి నిల్వలను కాపాడుకోవడం అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రబీ సాగులో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖా ఎస్ఈ, అమ్మగారి పల్లి సర్పంచ్ కవిత, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

జన్నారం మండల యువ మహేంద్ర సంఘం ఏకగ్రీవ ఎన్నిక



ప్రజాస్ఫూర్తి, జన్నారం: జన్నారం మండల కేంద్రంలో ఆదివారం జన్నారం మండల యువ మహేంద్ర సంఘం అధ్యక్షులు ఒడిపెల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి చింత రమణ, ప్రచార కార్యదర్శి వెంకటేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తమ మహేంద్ర సంఘం అభివృద్ధి చెందే విధంగా తమ సాయి శక్తుల కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర సంఘం అధ్యక్షులు ఎమ్మార్ నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షులు చిలువేరి నర్సయ్య, ఉద్యోగుల సంఘం అధ్యక్షులు సూరినేని కొండయ్య, కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సంద గోపాల్, మాజీ గౌరవ అధ్యక్షులు పర్ల శంకర్, మాజీ అధ్యక్షులు సంద కృష్ణ, మాజీ ప్రధాన కార్యదర్శి చిలువేరి సుధీర్ కుమార్, మదిరె సతీష్, కనికరపు రాకేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యమివ్వాలి

: ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



భూపాలపల్లి, (ప్రజా స్ఫూర్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చల్లగరిగ గ్రామంలో నిర్వహించిన జీఎస్ఆర్సీసీపీఎల్ 3 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యమిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. విజేతలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని, ఓటమి చెందిన క్రీడాకారులు నిరుత్సాహపడకుండా పట్టుదలతో సాధన చేసి క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లకు ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా నాయకులు, స్థానిక సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభం

* **ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి నిత్య అన్నదాన కార్యక్రమాన్ని మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు పాల్గొని ప్రారంభించారు.అంతకు ముందు అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప దీక్షాదారుల కోసం ఆదివారం నుండి డిసెంబర్ 20 వరకు ఏర్పాటు చేసిన మహా అన్న సమారాధన (నిత్య అన్నదాన) కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కోలన్ చంద్ర శేఖర్ రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మాజీ కౌన్సిలర్ నాచారం మురళి యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు ఉంగరాల శ్రీనివాస్, ఇంద్రకుమార్ దేవ్, సతీష్, హరిబాబు, 125 డివిజన్ ప్రెసిడెంట్ విజయ్ రామ్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు అభిషేక్ రెడ్డి, అయ్యప్ప స్వామి భక్తులు, దీక్షాదారులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు..

ఢిల్లీలో 'ఓట్ బచావో – దేశ్ బచావో' నిరసనను విజయవంతం చేయాలి

*** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: ఏఐసీసీ పిలుపు మేరకు నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'ఓట్ బచావో - దేశ్ బచావో' భారీ నిరసన కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా టీపీసీసీ అబ్జర్వర్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పిలుపునిచ్చారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల ముఖ్య నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ ఉమ్మడి జిల్లా క్లస్టర్ ఇన్‌చార్జి శరత్ నిరసన కార్యక్రమ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు..

సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

: బీఆర్ఎస్ నాయకులు



కుత్బుల్లాపూర్,ప్రజాస్ఫూర్తి: అర్హులైన ప్రతీ పేదవారు మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు అన్నారు.ఆదివారం చింతల్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ పత్రాలను ఆయా డివిజన్లకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనారోగ్యంతో ఉన్న ప్రతీ పేదవాడికి మెరుగైన వైద్య సదుపాయం అందాలనే లక్ష్యంతో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ వెనువెంటనే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఎల్ఓసీని మంజూరు చేయించి నిరుపేదల ఆరోగ్య రక్షకులుగా నిలిచారని అన్నారు. గాజుల రామారం డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన మహేందర్ చౌహాన్‌కు రూ.1,50,000, సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీకి చెందిన ఎల్. ఇందిరా రూ.2,00,000,సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డి నగర్ కు చెందిన టి.రామచంద్ర రావు కురూ.3,50,000లు,సీఎంసీ నిజాంపేట్ సర్కిల్ నిజాంపేట్ కు చెందిన తల్లారి శిరీష కు రూ.2,50,000లు ఎల్ఓసీ పత్రాలను అందజేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, ఆగం రాజు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు వారాల వినోద్, గుబ్బల లక్ష్మీనారాయణ, రాజ్ కుమార్, ప్రవీణ్, సాంబశివరెడ్డి, ప్రవీణ్, శివా నాయక్,సమ్మయ్య యాదవ్,విజయ్ తదితరులు

భవిష్యత్తు బాగుండే'లా'.. బాటలు వేసుకుందాం ఇ'లా'

లాయర్ అనగానే రోజంతా కోర్టులో పని చేస్తారని అనుకుంటారు. కానీ అది నిజం కాదు. నల్ల కోటు, కోర్టు మెట్లు, యువరానర్ అనే మాట, కోర్టుకు వెళ్లి వాదించడం ఇది న్యాయవాది వృత్తిలో ఒక కోణం మాత్రమే. చాలామంది లాయర్లు అసలు కోర్టు మెట్లు కూడా ఎక్కక పోవచ్చు. వారు చాలా సమయం లీగల్ రీసెర్చ్, డాక్యుమెంటేషన్, సెటిల్‌మెంట్లు, క్లయింట్స్‌తో చర్చల ద్వారా స్ట్రాటజీలు మాట్లాడుతూ ఉంటారు. లా ఎంట్రన్స్‌కి ఎలిజిబిలిటీ ఉన్నవారు అర్హులు. కానీ లాయర్‌గా ఎదగాలన్నా , బార్‌లో ప్రవేశం, ప్రాక్టీస్ చేయాలన్నా లా పట్ల అభిరుచి, విస్తృత పరిజ్ఞానం, కమ్యూనికేషన్ స్కిల్స్, నెగోషియేషన్ స్కిల్స్ అవసరం.

పన్నెండు/ఇంటర్ తర్వాత లా కెరీర్

ఉండేలా చూసుకోవాల్సింది వీరే. లీగల్ అడ్వైజర్లు ఒక సంస్థ, దాని ఉద్యోగులకు న్యాయ సలహా, సేవలను అందించడానికి ప్రభుత్వం, పెద్ద కంపెనీలు, ఇతర సంస్థల ద్వారా నియమితులయ్యే న్యాయవాదులు. మరో మాటలో చెప్పాలంటే లీగల్ అడ్వైజర్లు అంతర్గత న్యాయవాదులు.

అవకాశాలు

- లా కెరీర్ చేయాలనుకునే వారికి వివిధ రకాల అవకాశాలు ఉన్నాయి. లా కెరీర్‌ని ముఖ్యంగా కింది విభాగాలుగా విభజించుకోవచ్చు.
  1) లిటిగేషన్
  2) కార్పొరేట్ లాయర్
  3) జ్యుడీషియల్ సర్వీసెస్
  4) అకడమిక్
  5) లీగల్ జర్నలిస్ట్, లీగల్ అనలిస్ట్

లిటిగేషన్

- లిటిగేషన్ లాయర్లు కోర్టులో క్లయింట్‌ను రిప్రజెంట్ చేస్తారు. లిటిగేషన్ న్యాయవాదులు విడాకులు, వ్యాపారం వంటి లా స్పెషల్ ఏరియాస్‌లో అనుభవం కలిగి ఉంటారు. లిటిగేషన్ అంటే మనుషుల మధ్య లేదా కొన్ని గ్రూప్‌ల మధ్య ఉన్న విభేదాలు, కోర్ట్ ముందు ఆ సమస్యకు పరిష్కారం చూపే ప్రయత్నం. ఆ సమస్యకు పరిష్కారం అనేది కోర్టులో లేదా కోర్టు బయట చర్చలతో కూడా దొరకవచ్చు. విభేదం అనేది ఒక చట్టబద్ధమైన హక్కుకు సంబంధించి ఉంటే దాన్ని కోర్టు ముందుకు తీసుకెళ్లవచ్చు. ఇటువంటి సమస్యలు సాధారణ మనుషుల మధ్య, పబ్లిక్ ఇంట్రెస్ట్ ప్రకారంగా లేదా పేటెంట్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఇలా దేనికైనా సంబంధించి ఉండవచ్చు. క్రిమినల్ లాయర్, సివిల్ లాయర్ లా ప్రాక్టీస్ చేయవచ్చు.

కార్పొరేట్ లా

- కార్పొరేట్ లాయర్ ఎన్నో బిజినెస్ డీల్స్‌లో ప్రముఖ పాత్ర వహిస్తారు. ఒక కంపెనీ పెట్టాలనుకున్నా, ఇంకో కంపెనీని కొనాలనుకున్నా, రెండు కంపెనీలను కలపాలనుకున్నా చర్చల నుంచి అగ్రిమెంట్లు పూర్తయ్యేవరకు వీరి పాత్ర ఎక్కువ. భవిష్యత్తులో తన క్లయింట్‌కి ఎటువంటి సమస్యలు రాకుండా చూసుకోవడం వీరి బాధ్యత. కంపెనీలకు వారి చట్టబద్ధమైన హక్కుల గురించి తెలియజేయడం, వారు చేసే బిజినెస్ డీల్స్ చట్ట పరంగా

జ్యుడీషియల్ లేదా ఇతర సర్వీసెస్

- ప్రస్తుతం జ్యుడీషియల్ సర్వీసెస్ పరీక్ష లేదా ప్రొవిన్షియల్ సివిల్ సర్వీస్ జ్యుడీషనల్ పరీక్ష నిర్వహించబడుతున్నాయి. సర్వీస్ లెవల్‌ని బట్టి లా డిగ్రీ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. మేజిస్ట్రేట్, జడ్జి వంటి పదవిని సాధించడానికి ఇది అవసరం. సివిల్ సర్వీసెస్‌కి ప్రిపేరవచ్చు. దేశంలో ఉత్తమమైన లీగల్ బ్రైన్స్‌ని జ్యుడీషనరీలో ఉండాలని ఆశిస్తూ ప్రస్తుత ప్రభుత్వం, ఆలిండియా జ్యుడీషియల్ సర్వీస్‌ని, యూపీఎస్సీ వలే రూపుదిద్దడానికి ప్రయత్నిస్తుంది. దీన్ని రాష్ట్రపతి ముర్ము కూడా సపోర్ట్ చేశారు. కాకపోతే ఇది ఇంకా ఆరంభించడంలో కొన్ని ఆటంకాలు ఎదురవుతున్నాయి.

జర్నలిస్ట్, అనలిస్ట్

- లీగల్ జర్నలిస్ట్‌లు న్యాయ రంగానికి సంబంధించిన అన్ని విషయాల గురించి ప్రత్యేక రిపోర్టింగ్ చేసే వ్యక్తులు. లీగల్ జర్నలిజం అనేది జర్నలిజం శాఖ. ఇది జర్నలిజం, చట్టం రెండింటికి సంబంధించి ఉంటుంది. లీగల్ జర్నలిస్ట్‌లు సాధారణంగా పాత్రికేయుల మాదిరిగానే ఉంటారు. కానీ చట్టానికి సంబంధించిన విషయాలపై రిపోర్టింగ్ చేయడంపై ప్రత్యేకంగా దృష్టిపెడతారు. లీగల్ జర్నలిజానికి న్యాయ పరిజ్ఞానంతో పాటు జర్నలిజం నైపుణ్యాలు అవసరం. పత్రికా రంగం పట్ల ఆసక్తి ఉన్న వారు లీగల్ కరెస్పాండెంట్‌గా పని చేయవచ్చు. లీగల్ అనలిస్ట్‌లు చట్టపరమైన పరిశోధన చేస్తారు. చట్టపరమైన పత్రాలు, సాక్ష్యాలను సమీకరిస్తారు. ట్రాకింగ్ సిస్టమ్స్ డేటాబేస్‌లను నిర్వహిస్తారు. వ్యక్తిగత న్యాయవాదులు, న్యాయ బృందాల కోసం ఫైల్ పత్రాలను రెడీ చేయడం వంటివి చేస్తారు. ఎన్‌జీవోలతో, లీగల్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్‌లో పని చేయవచ్చు.

అకడమిక్

- భారతదేశంలో సుమారు 1200 ప్రభుత్వ, ప్రైవేట్ లా కాలేజీలు ఉన్నాయి. బోధన రంగం పట్ల మక్కువ ఉన్న వారు లీగల్ ఫ్యాకల్టీగా స్థిరపడవచ్చు.

ఇతర అవకాశాలు

- హయ్యర్ ఎడ్యుకేషన్. పీజీ, ఎల్ఎల్ఎంకి ప్రిపేరవచ్చు. లా డిగ్రీ పొందిన తర్వాత కొందరు ఎంబీఏకి కూడా ప్రిపేరవుతుంటారు.


స్కిల్స్

అనలిటికల్ అండ్ క్రిటికల్ థింకింగ్ స్కిల్స్

- లా లో ఈ స్కిల్స్ అవసరం. రీసెర్చ్ చేయడం, డాక్యుమెంట్ చదవగలగడం, క్లయింట్స్ చెప్పే విషయాలను అర్థం చేసుకుంటూ కావలసినవి ఇన్ఫర్ చేసుకోవడం చేయగలగాలి.

డీటెయిలింగ్

- క్లయింట్స్ ఇచ్చే ఇన్ఫర్మేషన్‌ను క్షుణ్ణంగా పరీక్షించి, ఇన్ఫర్మేషన్‌లో లోపాలు, విట్నెస్ చెప్పేవాటిలో తప్పులను గుర్తించగలగాలి. అటెన్షన్ టు డీటెయిల్స్ అవసరం.



ఆర్గనైజేషన్ స్కిల్స్

- క్లయింట్ రికార్డులు, ముఖ్యమైన డాక్యుమెంట్లు, ఇతర రికార్డులు ఆర్గనైజ్డ్‌గా ఉంచుకోవాలి. కంప్యూటర్ టూల్స్ ఉపయోగించి షెడ్యూలింగ్, ఇన్ఫర్మేషన్ స్టోర్ చేసుకుంటారు. కంప్యూటర్ స్కిల్స్ వీరికి ఉపయోగపడతాయి.

కమ్యూనికేషన్ స్కిల్స్

- లాయర్లు ఎదుటి వారిని కన్విన్స్ చేసేలాగా మాట్లాడాలి. అలాగే వారికి రైటింగ్ స్కిల్స్ అవసరం. డ్రాఫ్టింగ్, డాక్యుమెంట్ రైటింగ్‌లో తప్పులు లేకుండా, లూప్ హోల్స్ లేకుండా ఉండాలి. ఫైనాన్షియల్ స్కిల్స్ ఉండటం కూడా ఉపయోగపడుతుంది.

నాలెడ్జ్

- లీగల్ నాలెడ్జ్, టెక్నికల్ పదాలు, లా, అందులోని సెక్షన్ల పట్ల లోతైన అవగాహన అవసరం.

ఎంట్రన్స్ ఎగ్జామ్స్

- పదో తరగతి పూర్తి చేసుకుని, 12వ తరగతి/ ఇంటర్ పరీక్షల తర్వాత ఈ పరీక్షలు రాయడానికి అర్హత ఉంటుంది.

కామన్ లా ఎంట్రన్స్ టెస్ట్ (క్లాట్)

- దేశంలోని 24 నేషనల్ లా యూనివర్సిటీలకు ఇది ప్రవేశ పరీక్ష. 120 మార్కులు, 2 గంటల సమయంలో నిర్వహిస్తారు. 1/4 నెగెటివ్ మార్కింగ్ ఉంది.
- ఇందులో 5 సెక్షన్లు ఉంటాయి. ఇంగ్లిష్ లాంగ్వేజ్ (22-26 ప్రశ్నలు), కరెంట్ అఫైర్స్ అండ్ జనరల్ నాలెడ్జ్ 28 నుంచి 32, లీగల్ రీజనింగ్ నుంచి 28 నుంచి 32, లాజికల్ రీజనింగ్ నుంచి 22 నుంచి 26, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ నుంచి 10 నుంచి 14 ప్రశ్నలు వస్తాయి. ఇవన్నీ ఇంగ్లిష్‌లో ఉంటాయి. అన్ని సెక్షన్లు ప్యాసేజ్ రూపంలో ఉంటాయి. 450 పదాల వరకు ఈ ప్యాసేజ్‌లు ఉంటాయి.

క్లాట్ ప్రిపరేషన్

- క్లాట్ (https://consortiumofnlus.ac.in/) రీడింగ్ అండ్ రీజనింగ్ స్కిల్స్, జనరల్ అవేర్‌నెస్, మ్యాథ్స్ ఎబిలిటీని పరీక్షిస్తుంది.

1) **పుస్తక పఠనం:** క్లాట్‌లో ఉన్న అన్ని సెక్షన్లపై రీడింగ్ స్కిల్స్ ప్రభావం ఎక్కువగా ఉంది. సుమారు 450 పదాల ఒక వ్యాసం చదవాలంటే కనీసం 2-5 నిమిషాల సమయం పట్టవచ్చు. ఆ తర్వాత ఆ వ్యాసానికి సంబంధించిన ప్రశ్నలకు సమాధానం కూడా ఆలోచించాలి. కాబట్టి ఎంత త్వరగా చదివి అర్థం చేసుకోగలమో, అన్ని ఎక్కువ ప్రశ్నలు చేయగలం. ఇంగ్లిష్ పుస్తకాలు, న్యూస్ మ్యాగజీన్స్ చదివి, అవి రాసిన విధానంపై, ఉపయోగించే పదజాలంపై పట్టు సాధించాలి.
2) **పత్రికా పఠనం:** జీకేలో ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలంటే రోజూ వార్తలు చదవాలి. జాతీయ, అంతర్జాతీయ వార్తలపై అవగాహన ఉండాలి. కరెంట్ అఫైర్స్, ఆ విషయాలకు సంబంధించిన ఇతర విషయాలు చదవాలి. ముఖ్యమైన విషయాలపై ఎక్కువ సమాచారం సేకరించాలి.
3. **కాన్సెప్ట్స్ అండ్ ప్రాక్టీస్:** లీగల్ సెక్షన్‌కి రాజ్యాంగం, లీగల్ జీకేకి సంబంధించిన విషయాల గురించి తెలుసుకోవాలి. టార్ట్స్, కాంట్రాక్ట్స్ వంటి వాటికి సంబంధించిన ప్రిన్సిపల్స్ ప్రశ్నలు వస్తే అర్థం చేసుకోవాలి. క్రిటికల్ థింకింగ్ అలవర్చుకోవడానికి పజిల్ సాల్వింగ్, ఏదైనా విషయాన్ని గురించి చదివినప్పుడు ఆ విషయం వెనుక ఉన్న అంతరార్థం గురించి ఆలోచించాలి. ప్రశ్నలు అడిగే విధానం, ప్యాసేజ్‌లో ఉండే లాజికల్ లింక్స్‌ని అర్థం చేసుకోవాలి.
4) **మాక్ ఎగ్జామ్స్:** ఫైనల్ పరీక్ష కంటే ముందు మాక్ ఎగ్జామ్స్ రాసి, మార్కులను అనాలిసిస్ చేసుకోవాలి. తప్పు ఎందుకు పోయిందని ఆలోచించాలి. ఆ తప్పు మళ్లీ దొర్లకుండా చూసుకోవాలి.

- క్లాట్ కన్సార్టియానికి అనుబంధ కాలేజీలు ఈ మార్కులు అడ్మిషన్ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకుంటారు. అందులో యూపీఈఎస్ డెహ్రాడూన్, నిర్మా యూనివర్సిటీ అహ్మదాబాద్, ఐసీఎఫ్ఏఐ యూనివర్సిటీ, ఐపీయూ యూనివర్సిటీ ఢిల్లీ లాంటి కళాశాలలు ఉన్నాయి.

ఏఐఎల్ఇటీ: ఆలిండియా లా ఎంట్రన్స్ టెస్ట్, ఎన్ఎల్యూ ఢిల్లీ లో సీట్ రావాలంటే ఈ పరీక్ష రాయాలి. ఇది 150 ప్రశ్నలు, 2 గంటల పరీక్ష. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. ఈ పరీక్షలో ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, రీజనింగ్ సెక్షన్స్ ఉంటాయి. క్లాట్ లాగా అన్ని ప్యాసేజ్‌లు కాకుండా ఇందులో స్టేట్‌మెంట్ బేస్డ్ లేదా పేరాగ్రాఫ్ బేస్డ్ ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి.

టాప్ లా కాలేజీలు

- దేశంలోనే టాప్ 20 లా కాలేజీల్లో ఎన్ఎల్యూలే కాకుండా ఇతర ప్రఖ్యాత యూనివర్సిటీ లు.. సింబయాసిస్ యూనివర్సిటీ-పుణె, జామియా మిలియా యూనివర్సిటీ-ఢిల్లీ, కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండస్ట్రియల్ టెక్నాలజీ-భువనేశ్వర్, అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ-యూపీ, పంజాబ్ యూనివర్సిటీ-చండీగఢ్, ఇండోర్ లా ఇన్‌స్టిట్యూట్, బెనారస్ హిందూ యూనివర్సిటీ, క్రైస్ట్ యూనివర్సిటీ- బెంగుళూరు.
- ఇవే కాకుండా జిందాల్ లా స్కూల్, ఎన్ఎంఐఎంఎస్ కిరీట్ మెహతా లా స్కూల్ లాంటి ప్రఖ్యాత కళాశాలలు ఉన్నాయి.
- ఇంటర్‌లో ఏ స్ట్రీమ్ చదివినా కావాల్సిన ఉత్తీర్ణత శాతం ఉంటే ఈ పరీక్షలు రాయవచ్చు. కాకపోతే కొన్ని సందర్భాల్లో ఎలిజిబిలిటీ చూసుకోవలసిన అవసరం రావచ్చు. కొన్ని బీబీఏ ఎల్ఎల్‌బీ, బీకాం ఎల్ఎల్‌బీ కోర్సుల్లో అకౌంటింగ్, ఆడిటింగ్ లేదా బిజినెస్ స్టాటిస్టిక్స్ వంటివి ఉండటం వల్ల ఇంటర్‌లో ఎకనామిక్స్, కామర్స్ అలాగే మ్యాథమెటిక్స్ కాన్సెప్ట్స్ ఉండటం వల్ల తర్వాత ఎక్కువగా ఉపయోగపడుతుంది.



MOVIE TIME



రామాయణ
ప్రమోషన్స్‌పై విమర్శలు

- **మీమ్స్‌పై అభిమానుల ఫైర్**

భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా తెరకెక్కుతున్న భారీ చిత్రం ప్రమోషన్స్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. నితేశ్ తివారీ దర్శకత్వంలో నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ సినిమాలో రణ్‌బీర్ కపూర్ రాముడిగా, సాయిపల్లవి సీతగా, యశ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. అయితే తాజాగా చిత్ర బృందం విడుదల చేసిన మీమ్స్‌పై పలువురు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాటిలో రణ్‌బీర్ రాముడి పాత్రలో కన్నీళ్లు పెట్టుకుంటున్న దృశ్యాన్ని ఉపయోగించి.. 'ఫ్రిజ్ తెరిచి చూస్తే అందులో మిగిలిన ఆహారాన్ని ఎవరో తినేశారు' అనే అర్థం వచ్చేలా క్యాప్షన్ పెట్టారు. సినిమాలో భావోద్వేగభరితమైన సన్నివేశంగా చెప్పుకుంటున్న ఈ దృశ్యాన్ని హాస్యం కోసం వాడటంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రామాయణాన్ని పవిత్ర ఇతిహాసంగా భావించే వారి మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ప్రచారం చేయాల్సిందని అభిప్రాయపడుతున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న ఇలాంటి చిత్రానికి ఈ తరహా ప్రమోషన్స్ అవసరమా? అంటూ ప్రశ్నిస్తున్నారు. రాబోయే ప్రచార కార్యక్రమాల్లో చిత్ర బృందం మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తుందా? అనేది ఆసక్తికరంగా మారింది. యశ్ కూడా నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 5న థియేటర్లలో విడుదల కానుంది. సన్నీ డియోల్, వివేక్ ఒబెరాయ్, కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్ సింగ్ తదితరులు కీలకపాత్రల్లో నటిస్తున్నారు.

అందుకే బికినీ సీన్‌కు ఓకే!

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ 'కాక్‌టెయిల్ 2'లో తొలిసారి బికినీ సీన్‌లో నటించింది. తన శరీరం పట్ల ఇప్పుడు మరింత సౌకర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉన్నానని తెలిపింది. ఈ మూవీలో సీన్ తనకు సరైన సమయంలో వచ్చాయని కృతి వెల్లడించింది. 'ఇప్పుడు నా శరీరం పట్ల నాకు మరింత సౌకర్యంగా ఉంది. అందుకే ఆ సినిమా, అందులోని సన్నివేశం సరైన సమయంలో వచ్చాయి' అని చెప్పింది. ఇప్పటికే విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న కృతి.. 'కాక్‌టెయిల్ 2'లో భిన్నమైన పాత్రలో కనిపించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ఇటీవల పరుస వివాదాల్లో చిక్కుకున్న కృతి.. సినిమాలో తొలిసారి బికినీ సీన్‌లో నటించడం, దానిపై చేసిన వ్యాఖ్యలు అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించాయి.





నయన్ క్రేజ్ మామూలుగా లేదుగా!

నయన్‌తార ప్రధాన పాత్రలో సుందర్ సీ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'మూకుత్తి అమ్మన్ 2'. నవంబర్ 6న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చెన్నైలోని వేల్స్ థియేటర్స్ వద్ద ఏర్పాటు చేసిన 60 అడుగుల నయన్‌తార కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దేశంలో ఓ హీరోయిన్ కోసం ఏర్పాటు చేసిన భారీ కటౌట్ ఇదేనని ప్రచారం జరుగుతోంది. తెలుగులో ఈ చిత్రం 'మహాశక్తి' పేరుతో విడుదల కానుంది. సూర్య 'సీన్', భారీ బడ్జెట్ చిత్రం 'రామాయణ'తో బాక్సాఫీస్ వద్ద ఈ మూవీ పోటీపడనుంది. వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్, రౌడీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, దునియా విజయ్, అజయ్ ఘోష్, ఊర్వశి, యోగిబాబు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

మారుతి! నెక్ట్స్ ఏంటీ?

'ది రాజాసాబ్' పరాజయం తర్వాత దర్శకుడు మారుతి తర్వాతి సినిమాపై ఆసక్తి నెలకొంది. ఓ పాపులర్ హీరోతో ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ చేయనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. ఇప్పటివరకు ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రాలేదు. దీంతో అసలు సినిమా ఎప్పుడు పట్టాలెక్కుతుందనే చర్చ మొదలైంది. స్క్రిప్ట్ పనులా? హీరో డేట్స్ సమస్యా? మరేదైనా కారణమా? అనేది తెలియాల్సి ఉంది. తెలుగులో ట్రెండ్‌కు తగ్గ వినోదాత్మక చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న మారుతి రాబోయే సినిమాపై అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా కామెడీని తనదైన శైలిలో తెరకెక్కించడంలో ఆయనకు మంచి పేరుంది. ది రాజాసాబ్ మూవీతో ఆయనపై తెగ ట్రోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త చిత్రంతో మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. మరి ఈసారి ఆయన ఎలాంటి కథతో ప్రేక్షకుల ముందుకొస్తారు? కొత్త సినిమా ఎప్పుడు మొదలవుతుంది? అన్నది ఆసక్తికరంగా మారింది.



మంగళవారం సీక్వెల్ రెడీ!

'ఆర్ఎక్స్ 100'తో సంచలనం సృష్టించిన దర్శకుడు అజయ్ భూపతి. 'మంగళవారం' సీక్వెల్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఈ సినిమా స్క్రిప్ట్ పనులు తుది దశకు చేరాయి. వచ్చే ఏడాది షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ చిత్రాన్ని అజయ్ భూపతే స్వయంగా నిర్మించనుండడం విశేషం. త్వరలో సినిమాను అధికారికంగా ప్రకటించనున్నట్లు అజయ్ భూపతి తెలిపారు. అధికారిక ప్రకటన తర్వాత నటీనటులు, సాంకేతిక బృందాన్ని ఖరారు చేయనున్నారు. మంగళవారం మూవీలో పాయల్ అద్భుతంగా నటించిన విషయం తెలిసిందే. ఆమె యాక్టింగ్ హైలెట్‌గా నిలిచింది. ఈ క్రమంలో సీక్వెల్‌లోనూ పాయల్ రాజ్‌పుత్, ప్రియదర్శిని కొనసాగించనున్నట్లు సమాచారం. కథలో భక్తి, ఆధ్యాత్మిక అంశాలకు కూడా చోటివ్వనున్నారనే టాక్ నడుస్తోంది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.